చంద్రగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సోదాలు

విశాలాంధ్ర - చంద్రగిరి: చంద్రగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాల యంలో శుక్రవారం సీబీఐ అధికారులు సోదాలు నిర్వహించారు. శ్రీకాళహస్తికి చెందిన రావూలూరి శ్రీనివాసులు నాయు డు చిత్రదుర్గ నేషనల్ హైవే అథారిటీ ప్రాజెక్టు డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆయనపై నమోదైన అక్రమ ఆస్తుల కేసు విచారణను సీబీఐ చేపట్టింది. ఇందులో భాగంగా చంద్రగిరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శుక్రవారం డీఎస్పీ మహేశ్, సీఐ షైనీ రికార్డులు పరిశీలించారు. ఇదిలా వుండగా రావులూరి శ్రీనివాసులు నాయుడు పేరిట తమ కార్యాల యంలో ఎలాంటి ఆస్తులు నమోదు కాలేదని సబ్ రిజిస్ట్రార్ కొండారెడ్డి తెలిపారు.

విశాలాంధ్ర



తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

శనివారం 19 అక్టోబరు 2024 8 పేజీలు

రుయా ఆసుపత్రిలో...

మెరుగైన సౌకర్యాలకు చర్యలు

పేదలకు మెరుగైన నాణ్యమైన వైద్యం కోసం కట్టుబడి వైద్యఆరోగ్య సిబ్బంది పనిచేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర- తిరుపతి : రుయా ఆసుపత్రిలో మెరుగైన పలు సౌకర్యాల ఏర్పాటుకు కమిటీ ఆమోదిస్తూ పేదలకు మెరుగైన నాణ్యమైన వైద్య సేవలు బాధ్యతగా అందించాలని వైద్య సిబ్బందికి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ మరియు ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు సంయుక్తంగా తెలిపారు. శుక్రవారం స్థానిక ఎస్వీ వైద్య కళాశాల పాలన భవనం కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా కలెక్టర్ గారు చైర్మన్ హోదాలో అధ్యక్షత వహించి, స్థానిక ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు కో చైర్మన్ హోదాలో, బి.లక్ష్మీపతి సభ్యులుగా సంబంధిత కమిటీ సభ్యుల తో సమీక్షలో పాల్గొని రుయా ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ సమావేశాన్ని నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మరియు ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు మాట్లాడుతూ వైద్యులు వారి సిబ్బంది, ఇంజనీర్లు మరియు ఇతర అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అప్పుడే ఆసుపత్రి పేద రోగులకు అండదండగా వుంటుందని తెలిపారు. ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ మీటింగ్ గత ఒకటిన్నర సంవత్సరం నిర్వహించలేదని అధికారులు తెలుపగా తాను కలెక్టర్ గా ఉన్న నాటి నుండి ఇది రెండో సమావేశం అని, ఇక నుండి క్రమం తప్పకుండా సమావేశం నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ సమావేశంలో శ్రీ మతి ఎన్. మౌర్య, తిరుపతి మునిసిపల్ కమీషనర్, శ్రీ బి. లక్ష్మీపతి హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ

2

సఫాయి కర్మచారిలకు...

కనీస వేతనాలు చెల్లించేలా చర్యలు చేపట్టండి

- సఫాయి కర్మచారి కమిషన్ చైర్మన్

విశాలాంధ్ర -చిత్తూరు : సఫాయి కర్మచారి లకు ప్రభుత్వం నిర్ణయించిన మేరకు వేతనాలు అందించాలని సఫాయి కర్మచారి కమిషన్ చైర్మన్ ఎం.వెంకటేశన్ తెలిపారు. శుక్రవారం జిల్లా సచివాలయం లో ని సమావేశపు మందిరంలో సఫాయి కర్మచారి కమిషన్ చైర్మన్, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్,ఎస్ పి.మణికంఠ చందోలుతో కలసి జిల్లాలో సఫాయి కర్మచా రులు ఎదుర్కొంటున్న సమస్యలపై అన్ని శాఖల జిల్లా అధికారులు ,ఆర్ డి ఓ లు, మున్సిపల్ కమిషనర్ల తో కలసి సమీక్ష నిర్వహించారు. ఈ సంద ర్భంగా సఫాయి కర్మచారి చైర్మన్ వెంకటేశన్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్,ఎస్ పితో కలసి జిల్లాలోని పారిశుధ్య కార్మికుల సంక్షేమం పై సమీక్ష నిర్వహిం చడం జరిగిందన్నారు. జిల్లాలో పారిశుధ్య కార్మికుల కు ఏజెన్సీ ల ద్వారా కాకుండా నేరుగా జీత భత్యాలు చెల్లించడం జరుగుతుందని ఇది శుభ పరి ణామం అని తెలిపారు.ఈ సమీక్షలో జిల్లాలోని మునిసిపాలిటీ లకు సంబం ధించిన పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారని తెలిపారు. ఈ సమీక్షలో భాగంగా చిత్తూరు జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి నందు విధులు నిర్వర్తిస్తున్న కార్మికులకు జీతభత్యాలు చెల్లింపులలో

2

సీఎం సొంత ఇలాకాలో...

108కి జబ్బు చేసింది

చంద్రగిరిలో నెల రోజులుగా జాడలేని అంబులెన్స్ - పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి సొంత మండలం అయిన చంద్రగిరిలో 108 వాహనానికి జబ్బు చేసింది. చంద్రగిరి నియోజకవర్గ కేంద్రంలో నెల రోజులుగా 108 అంబులెన్స్ జాడ కనిపించడంలేదు.దీంతో అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చంద్రగిరి మండలంలో ప్రధానంగా రెండు పూతలపట్టు - నాయుడుపేట, తిరుపతి - మదనపల్లె జాతీయ రహదారులున్నా యి.ఈ మార్గాల్లో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతుం టాయి. దీంతో గతంలో మండలానికి రెండు 108 అంబులెన్స్ వాహనాలను కేటాయి ంచారు. అంబులెన్స్ యాజమాన్యం ఈ మండలానికి ఒక అంబులెన్స్ సరిపోతుందని

2లో

సాయం చేద్దామని వెళ్లి...

ప్రాణాలు పోగొట్టుకున్న అటవీ శాఖ ఉద్యోగి

విశాలాంధ్ర-తొట్టంబేడు: సాయం చేద్దామని వెళ్లి... రోడ్డు ప్రమాదంలో ఓ అటవీశాఖ ఉద్యోగి ప్రాణాలు పోగొట్టుకున్నాడు. ఆయన మరణంతో వారి కుటుంబం వీధిన పడింది. ఈ విషాదకర ఘటన గురువారం అర్ధరాత్రి తరువాత తొట్టంబేడు మండలంలో జరిగింది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. తొట్టంబేడు మండలం బసవయ్యపాళెం గిరిజనకాలనీకి చెందిన సిద్దయ్య కుమారుడు వెంకటేష్ (32) శ్రీకాళహస్తి అటవీశాఖలో ప్రొటెక్షన్ వాచర్ గా విధులు నిర్వర్తించేవాడు. గురవారం రాత్రి పొద్దు పోయాక తొట్టంబేడు మండలం పెద్దకన్నలి గిరిజన కాలనీ సమీపంలో పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై ఓ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాద విషయమై శ్రీకాళహస్తి రెండవ పట్టణ పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో రాత్రి 12గంటల తరువాత అనిల్ (45), సుబ్రహ్మణ్యం (36) అనే కానిస్టేబుళ్లు ప్రమాదం జరిగిన చోటుకు బయలు దేరారు. అంతకు మునుపు చెక్ పోస్టు

2

కనీస వేతనాలు చెల్లించేలా చర్యలు చేపట్టండి

(మొదటి పేజీ తరువాయి) వ్యత్యాసం ఉన్నదని, ప్రభుత్వ నిబంధనల మేరకు కనీస వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించడం జరిగిందన్నారు. ఎన్ ఎస్ కె ఎఫ్ డి సి స్కీం పై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని, బ్యాంకు ల ద్వారా రూ.2 లక్షల వరకు ఎటువంటి పూచీకత్తు లేకుండా రుణాలు అందించేలా లీడ్ బ్యాంక్ బ్యాంక్ మేనేజర్ కు ఆదేశాలు జారీ చేయలని జిల్లా యంత్రాంగానికి తెలిపామన్నారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూసఫాయి కర్మచారి కమిషన్ ఛైర్మన్ అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశం లో సఫాయి కర్మచారిలకు సంబంధించి అంశాలను చర్చించడం జరిగిందని తెలిపారు. ఈ సమీక్ష లో భాగంగగా పారిశుధ్య కార్మికులకు అందిస్తున్న ఆరోగ్య భద్రత, జీత భత్యాలు, పి ఎఫ్, ఇన్సూ రెన్స్ సౌకర్యం అంశాలను చర్చించడం జరిగిందని తెలిపారు.జిల్లాలో గత నెలలో ఎస్ సి, ఎస్ టి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మీటింగ్ నిర్వహించడం జరిగిందని, వీటికి సంబంధించిన అంశాల ను ఛైర్మన్ దృష్టికి తీసుకు వెళ్ళడం జరిగిందన్నారు.ఈ సమీక్షలో చిత్తూరు జిల్లా ప్రధాన ఆస్పత్రిలో సఫాయి కర్మచారులు గా పనిచేస్తున్న నియమ నిబంధనల మేరకు వారికి పారిశుధ్య కార్మికులకు వేతనాలు అందించడం లేదని, ఆస్పత్రిలో సరైన వైద్య సేవలు అందివ్వడం లేదని,జూనియర్ డాక్టర్లు సేవలందించే విషయాన్ని సభ దృష్టికి తీసుకొని వచ్చారు.ప్రభుత్వ యంత్రాంగం తరపున అందుతున్న సౌకర్యాలను అడిగితెలుసుకున్నారు.జీత భత్యాలు అందుతున్న తీరు ను,కాంట్రాక్ట్ ఏజెన్సీ ల వివరాలను పరిశీలిం చారు. ఈ ఎస్ ఐ ద్వారా అందుతున్న వైద్య సదుపాయాలు, పి ఎఫ్ సౌకర్యాలను సక్రమంగా అమలు చేస్తున్నారా అని ఆరా తీశారు.చిత్తూరు జిల్లా లో ఈ ఎస్ ఐ హాస్పిటల్ చేయాలని అప్ కాస్ ద్వారా మునిసిపాలిటీ లలో విధులు నిర్వహిస్తున్న సఫాయి కర్మచారిలకు ఇంటి స్థలాలు కేటాయించాలని,ప్రతి నెలా రెగ్యులర్ జీతాలు అంద జేయాలని యూనిఫారం, చెప్పులు అందించాలని ప్రతి మూడు నెలలు కు ఒకసారి మెడికల్ క్యాంపులు నిర్వహించాలని మరియు ఈ కమిషన్ కు సంబందించిన అంశాలను పలువురు ఛైర్మన్ దృష్టి కి తీసుకుని రాగా కలెక్టర్ స్థాయిలో పరిష్కారం అయ్యే అంశాలను పరిశీలిస్తా మని ఛైర్మన్ తెలిపారు. సమీక్షలో బాగంగా పనిచేసే ప్రదేశాలలో మహిళలు అనేక సమ స్యలను ఎదుర్కొంటు న్నారని పలువురు సబ దృష్టికి తీసుకొని....జిల్లా కలెక్టర్ స్పందిస్తూ మహిళల సమస్య లను పరిష్కరించేందుకు మహిళల అధికారులతో కమిటీ ఏర్పాటు చేయడమై నదని ఈ అంశాన్ని అందరికీ తెలిసేలా నోటీస్ బోర్డ్ నందు ప్రదర్శించాలని, ఈ విషయంపై అవగాహన పెంచాలని ఛైర్మన్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ జి. విధ్యాధరి,జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి రాజ్యలక్ష్మి,డి ఎం హెచ్ ఓ డాక్టర్ ప్రభావతి దేవి, డిసిహెచ్ఎస్ డాక్టర్ ప్రభావతి, హౌసింగ్ పీడీ పద్మనాభం, ఎల్డీఎం హరీష్, ఆర్డీఓ లు శ్రీనివాసరావు శ్రీనివాసులు వెంకట్ రెడ్డి,చిత్తూరు మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్,సంఘ నాయకులు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

108కి జబ్బు చేసింది

(మొదటి పేజీ తరువాయి) భావిం చింది.రెండో అంబులెన్స్ మరో చోటకు కేటాయించింది. ఇప్పుడు ఉన్న ఒక్క అంబులెన్స్ కూడా కనిపించడంలేదు.రోడ్డు ప్రమాదాలు జరిగితే క్షతగాత్రులు ప్రైవేటు వాహనాల్లో ఆసుపత్రికి వెళ్ళాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్రామీణ ప్రాంత ప్రజలకు అత్యవసర పరిస్థితులు ఏర్పడితే ప్రయివేట్ వాహనాన్ని ఏర్పాటు చేసుకోవల్సి వస్తోంది.ఏదైనా పెద్ద ప్రమాదం జరిగితే తిరుపతి, భాకరాపేట,పాకాల, రామచంద్రాపురం నుంచి అంబులెన్స్ లు రావాల్సి వస్తుంది.ఈ వాహనాలు రావడానికి ఎక్కువ సమయం పడుతోంది.ఈ అంబులెన్స్ కోసం ఎదురుచూసి విసిగి ప్రైవేటు వాహనాల్లో ఆసుపత్రులకు వెళ్ళుతున్నారు.ఇటీవల తొండవాడ సమీపంలో ఆటో, ద్విచక్ర వాహనం ఢీ కొన్న ప్రమాదంలో ఎక్సైజ్ కానిస్టేబుల్ హిదయతుల్లాకు కాలు విరిగింది. ప్రమాదం జరగగానే ఆటో డ్రైవర్ పరారయ్యాడు.స్థానికులు 108 అంబులెన్స్ వాహనానికి పోన్ చేసినా ఎంత సేపటికీ రాలేదు. దీంతో సంఘటనా స్థలానికి వెళ్ళిన కానిస్టేబుల్ చిరంజీవి క్షతగాత్రుడ్ని అదే ఆటోలో చంద్రగిరి ఆసుపత్రికి చికిత్స కోసం తీసుకొచ్చారు. ఇలాంటి సంఘటనలు నెల రోజుల్లో ఎక్కువగా జరిగాయి.అధికారులు స్పందించి 108 అంబులెన్స్ వాహనాన్ని పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు. రెండు అంబులెన్సులు అవసరం..చంద్రగిరిలో రెండు అంబులెన్సులు ఏర్పాటు చేయాలి.మండలంలో రెండు జాతీయ రహదారులు ,గ్రామీణ ప్రాంతాలకు వెళ్ళేందుకు ఏడు రహదారులు ఉన్నాయి. ఒక అంబులెన్స్ జాతీయ రహదారుల్లో నిత్యం జరిగే రోడ్డు ప్రమాణాలకు,మరొకటి గ్రామీణ ప్రాంతాల వారికి అవసరమవుతుంది. -పులిపాటి హేమాద్రి, ఏజీ పల్లె రెండు రోజుల్లో సమకూర్చుతాం...ఇటీవలే బాధ్యతలు చేపట్టాను. ఇక్కడి అంబులెన్స్ తరచూ మరమ్మతులకు గురవుతుంది.రిపేర్ చేయడంలో ఆలస్యం అయింది. అత్యవసరం ఉన్నపుడు,పక్క కేంద్రాల నుంచి అందుబాటులోకి తీసుకువస్తున్నాం.రెండు మూడు రోజుల్లో పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తాం. సంజీవరెడ్డి, జిల్లా మేనేజర్, 108 అంబులెన్స్ వాహనం.

ప్రాణాలు పోగొట్టుకున్న అటవీ శాఖ ఉద్యోగి

(మొదటి పేజీ తరువాయి) వద్ద విధుల్లో ఉండి... బసవయ్యపాళెం గిరిజన కాలనీలో ఇంటి వద్దకు వచ్చిన వెంకటేష్ వద్దకు వారు వెళ్లారు. ప్రమాదం ఎక్కడ జరిగిందో చూపాలని కోరారు. దీంతో వెంకటేష్ వారి వెంట పోలీసు జీపులో పెద్దకన్నలి గిరిజన కాలనీ వద్దకు వెళ్లాడు. ప్రమాదం జరిగిన స్థలాన్ని చూపాడు. ఆ తరువాత వెంకటేష్ పోలీసు జీపులో కూర్చుని ఉండగా... కర్ణాటకకు చెందిన ఓ బస్సు అతివేగంగా వచ్చి ఈ పోలీసు జీపును ఢీకొంది. ఈ ఘటనలో వెంకటేష్ అక్కడకక్కడే ప్రాణాలు వదిలాడు. ఈ ఘటనలో పోలీస్ కానిస్టేబుళ్లు అనిల్, సుబ్రహ్మణ్యం కూడా గాయపడ్డారు. పోలీసులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. వెంకటేష్ అక్కడే మృతి చెందడంతో ఆయన మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులకు సాయం చేయడానికి వెళ్లి రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వెంకటేష్ ను చూసి పలువురు కంట తడిపెట్టారు. వెంకటేష్ మృతితో బసవయ్యపాళెం గిరిజన కాలనీలో విషాదం నెలకొంది. ఈ ఘటనపై శ్రీకాళహస్తి రెండవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెరుగైన సౌకర్యాలకు చర్యలు

(మొదటి పేజీ తరువాయి) సభ్యులు డా.పి.ఎ. చంద్రశేఖరన్, ఎస్.వి. మెడికల్ కళాశాల పిన్సిపాల్, శ్రీ ఎం. శివరామి రెడ్డి, ఎ.పి.ఎం. ఎస్.ఐ.డి.సి. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డా? యు శ్రీహరి, తిరుపతి జిల్లా ఆరోగ్య వైద్యాధికారి, డా? ఎస్. ఆనంద మూర్తి, జిల్లా డి.సి.హెచ్. ఎస్. మరియు రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా? జి రవి ప్రభు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రుయా హాస్పిటల్ సూపరింటెండెంట్ రవి ప్రభు మెంబర్ కన్వీనర్ హెూదాలో ముందుగా గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై తీసుకున్న చర్యలను కమిటీకి వివరించారు. అనంతరం అజెండా అంశాలపై కమిటీకి నివేదించారు. కమిటీలో మునుపటి సమావేశం (17-06-2024) నాడు తీసుకొన్న తీర్మానాల స్థితిని తిరిగి సమీక్ష నిర్వహించగా ఆక్సిజన్ పైప్‌లైన్‌ల నిర్వహణకు టెండర్లను ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పిలవడం జరిగిందని పలు అంశాలపై తీసుకున్న చర్యలను తెలిపారు. మహాప్రస్థానం వాహనాలకు సంబంధించి 3 వాహనాలను ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వారు కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ నిధుల నుండి అందించుటకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా నేటి శుక్రవారం సమీక్షలో పదకొండు (11) సి.సి. కేమేరాలను ఎ.పి.ఎం.ఎస్.ఐ.డి.సి, క్షయ, ఛాతీ వ్యాధుల వార్డు, చిన్న పిల్లల హాస్పటల్ బ్లాక్ దారిలో అమర్చుటకు ఆమోదం తెలిపారు. నాలుగు (4) . ప్లాంట్స్ ఆపరేషన్ థియేటర్లలో మరియు ల్యాబ్ ల దగ్గర ఏర్పాటు చేయుటకు (ఒక్కొక్కటి రూ. 95,000/-) వైద్య సేవ నిధుల నుండి కొనుగోలు చేయుటకు ఆమోదించారు. ఆసుపత్రిలో ఉన్న దుకాణాలకు టెండర్ కాల పరిమితి 17 అక్టోబర్ 2024 న ముగిసింది. ఇప్పుడు ఉన్న దుకాణాలు ఖాళీచేయుటకు మరియు కొత్త టెండర్స్ నిర్వహించుటకు, అలాగే వాటికి నెల సరి అద్దె తగిన విధముగా పెంచవలసిందిగా సూచించారు.హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ అకౌంట్స్ ఆడిట్ చేయుటకు చార్టెడ్ అకౌంటెంట్ ను సేవలు వినియోగించుకొని దానికి ఖర్చు నిధుల నుంచి మంజూరు చేయుటకు ఆమోదిం చారు. చిన్న పిల్లల ఆసుపత్రిలో మరియు విభాగాలకు పది (10) ఎయిర్ కండీషనర్లు కొనుగోలు చేయుటకు ఆమోదము తెలుపుతూ, హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ నిధులు తక్కువగా ఉండడము వలన వీటిని కాలేజీ డెవలప్మెంట్ నిధుల నుంచి కొనుగోలు చేయవలసిందిగా కమిటీ నిర్ణయించింది. అత్యవసర చికిత్స విభాగము వద్ద వెలుగుతున్న సూచికలను (గ్లో సైన్ బోర్డు) పెట్టుటకు కమిటీ ఆమోదము తెలిపింది. గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ వారికి విధులలో ఉన్న వైద్యులు భోజన సదుపాయానికి ఇవ్వబడిన గది మరియు వారు నిర్వహిస్తున్న కాంటీన్ కు రెండు (2) సంవత్సరముల వరకు ఇచ్చుటకు ఆమోదము తెలుపుతూ, అలాగే హంసా అసోసియేషన్ వారికి మరియు నర్సింగ్ అసోసియేషన్ వారికి కలిపి ఒక కాంటీన్ నిర్వహించుకొనుటకు ఆమోదము తెలిపారు.మానసిక చికిత్స విభాగమునకు మరమత్తులకు రూ. 30,000/- మరియు ఆపరేషన్ థియేటర్ల కు మరియు వార్డ్స్ కు మధ్య ఉన్న రెండు (2) కారిడార్ల మరమ్మతులకు రూ.8 లక్షలు ఎన్టీఆర్ వైద్య సేవా నిధుల నుండి వాడుటకు కమిటీ ఆమోదించింది. ఎపిఎంఎస్ఐడిసి వారు హాస్పిటల్ పరిధిలో గుర్తించిన ఖాళీ స్థలములో గిరిజన కోపరేటివ్ కార్పొరేషన్ వారు గిరిజన ఉత్పత్తులు అమ్ముకొనుటకు ఆమోదం తెలిపారు. జిరియాట్రిక్ వార్డ్ మరమత్తులకు రూ. 23.75 లక్షలుబీ అదనముగా రెండు బయో మెడికల్ ఇంజనీర్ల పోస్టుల మంజూరు, ముగ్గురు ఆక్సిజన్ టెక్నీషియన్ ల పోస్టుల మంజూరు మరియు హాస్పి టల్ పరికరముల రిపేర్ గురించి వర్క్ షాప్ నిర్మించుట కొరకు వైద్య విద్య సంచాలకులకు ప్రతిపాదనలు పంపుటకు మరియు హాస్పిటల్ లో సెంట్రల్ లాబరేటరీ అభివృద్ధి చేయుటకు కమిటీ చర్యలు తీసుకోవాలని సూచించింది.అత్యవసర విభాగము నందు కొత్త టాయిలెట్స్ నిర్మాణానికి (సుమారు 5 లక్షలు) కాలేజీ డెవలప్మెంట్ సొసైటీ నుంచి నిర్మించుటకు కమిటీ ఆమోదము తెలిపింది. సెంట్రల్ ల్యాబ్ అన్నివిధాల అభివృద్ధికి, ఏసీ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది.హాస్పిటల్లో డ్రైనేజ్ సమస్యను పరిష్కరించుటకు, ఆసుపత్రికి అదనముగా నీటి సరఫరా కొరకు మునిసిపల్ కమీషనర్ గారు సహకారం అందించాలని కోరగా సత్వర చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. రోగులను హాస్పిటల్లో వివిధ వార్డుల కు తరలించేందుకు వీలుగా ఒక అంబులెన్స్ అద్దె వాహనము తీసుకొనుటకు ఆమోదము తెలిపారు. ఈ సమావే శంలో అన్ని విభాగాల లు, శానిటేషన్ ఏజెన్సీ, ఎక్స్‌పర్ట్ సెక్యూరిటీ సర్వీసెస్, నెఫ్రో ప్లస్, ప్రమోదిని ఏజెన్సీలు, నర్సింగ్ సూపరిటెండెంట్, సిరిక్స్ ఏజెన్సీ, బయోమెడికల్ ఇంజనీర్ మరియు జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మొదలగు వారు సమావేశమునకు హాజరయ్యారు.

బోయకొండ గంగమ్మకు రాహుకాల అభిషేకం

విశాలాంధ్ర - చౌడేపల్లి : శక్తి స్వరూపిణి బోయకొండ గంగమ్మకు శుక్రవారం లోక సుభిక్షం కోరుతూ రాహు కాల అభిషేకాన్ని సాంప్ర దాయ పద్ధంగా నిర్వహిం చారు రాహుకాల అభిషే కానికి భక్తుల నుంచి విశేష స్పందన లభించింది ఉద యాన్నే ప్రధాన అర్చకులు వేద పండితుల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష అభిషే కము అలం కరణ గావిం చారు అనంతరం రాహుకాల సమయంలో రాహుకాల అభిషేకాన్ని నిర్వహించారు పాత కళ్యాణ కట్ట వద్ద భక్తులకు శుక్రవారం ఉచిత అన్న ప్రసాద శిబిరాన్ని ఏర్పాటు చేశారు అన్నదాన కార్యక్రమానికి పలమనేరు కు చెందిన నవీన్ అతని మిత్ర బృందం ఉచిత అన్న ప్రసాదానికి కూరగాయలు విరా ళంగా అందించారు ఆలయ ఇఓ మరియు ఉప కార్యనిర్వా హణాధికారి ఏకాంబరం అర్చక అధికార సిబ్బంది పాల్గొన్నారు

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర-వెదురుకుప్పం: పౌష్టికాహారం తీసుకోవడం వల్లే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని కర్వేటినగరం సీడీపీఓ పద్మసునంద అన్నారు.శుక్రవారం మండల కేంద్రంలో గ్రామ సచివాలయంలో నిర్వహించిన సామజిక వేడుక కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహారం స్టాల్స్ ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..గర్భవతులు, బాలింతలు ఆకుకూరలు, పప్పుదినుసులు,కూరగాయలు తీసుకోవాలని సూచించారు.తద్వారా రక్త హీనత సమస్యలు అధికమించవచ్చని అన్నారు.ఈ కార్యక్ర మంలో సూపర్ వైసర్ భారతి,ఏ ఎన్ ఎం ఎల్లసానమ్మ,అంగన్వాడీ కార్య కర్తలు జయసుధ,విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

నిర్దిష్ట వైకల్యాలపై

అవగాహన అవసరం

విశాలాంధ్ర-గంగాధర నెల్లూరు: నిర్దిష్ట వైకల్యం పై విద్యార్థులకు, తల్లిదండ్రులకు టీచర్లుకు అవగాహన అవసరమని ఎంఈఓలు ఆంజినేయులు శెట్టి, గుణశేఖర్ రెడ్డిలు అన్నారు . గంగాధరనెల్లూరు హైస్కూల్లో నిర్దిష్ట వైకల్యం పై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉన్న అభ్యసన సమస్యలను ప్రాథమిక స్థాయిలో గుర్తించి, సరైన శిక్షణ ఇవ్వడం వలన వారిలో అభివృద్ధిని సాధించవచ్చన్నారు. మెలకువలను బోధించడం ద్వారా వారిలో విద్యాభివృద్ధిని పెంపొందించవచ్చని తెలిపారు. టీచర్లు వ్యక్తిగతంగా పర్యవేక్షించడం వలన, నైపుణ్యాలను పెంపొందించవచ్చు అన్నారు. . ఈ కార్యక్రమంలో పీహెచ్వో శ్రీనివాసులు, హెచ్.ఎం. లు హేమలత, రెడ్డమ్మ, సహిత విద్య టీచర్లు వరదారెడ్డి,పుష్పావతి, టీచర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

22న ప్రభుత్వ ఐటిఐలో జాబ్ మేళా

విశాలాంధ్ర - కార్వేటినగరం : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ సిడాప్, డిఆర్డిఎ సంయుక్తంగా ఈ నెల 22వ తేది మంగళవారం స్థానిక కార్వేటినగరం ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించడం జరిగిందని ప్రిన్సిపాల్ పీ.గణేష్ తెలిపారు. ఈ సందర్బంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ బిగ్ సి జీతం 12 వేలనుండి 18 వేలు వస్తుందని పేర్కొన్నారు. కనీస విద్యార్హత పదవ తరగతి,ఇంటర్, ఐటిఐ, డిగ్రీ పాస్ లేదా ఫైల్ అయినా విద్యార్థులు 18 సంవత్సరాలనుండి 35 సంస్థల మధ్య మైస కలిగిన పురుషులు, మహిళలు హాజరు కావచ్చు అని తెలిపారు. ఈ చేపలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తుఫాను బాధితులను ఆదుకోండి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: తుఫాను బాధితులను ఆదుకోవాలని సీపీఐ నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం శ్రీకాళహస్తి తహసీల్దారు లక్ష్మీనారాయణను కలసి వినతిపత్రం సమర్పించారు. తుఫాను ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని ముళ్లపూడి గిరిజన కాలనీ, వేడాం గిరిజన కాలనీ, చుక్కల నిడిగల్లు గిరిజన కాలనీ, ఈశ్వరయ్య గిరిజనకాలనీతో పాటు శ్రీకాళహస్తి పట్టణ శివారులో గల చెంచులక్ష్మీ గిరిజనకాలనీలో పలు ఇళ్లు దెబ్బ తిన్నాయన్నారు. వర్షం కారణంగా వీరు ఉపాధి కూడా కోల్పోయారన్నారు. ఈ గిరిజన కాలనీల్లో గల యానాదులను ఆదుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య, మండల కార్యదర్శి మించల శివకుమార్, యువజన సంఘం నాయకులు మునిరాజా, శివ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో ఎంజీఎం విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: తమిళనాడు రాజధాని చెన్నైలోని ఆరణిలో ఈ నెల 13వ తేదీ ఆదివారం జరిగిన అబ్దుల్ కలాం ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో శ్రీకాళహస్తి పట్టణంలోని ఎంజీఎం పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. అండర్-14 బాలుర విభాగంలో 8వ తరగతికి చెందిన పీఎంకే తేజో మారుతి ప్రసాద్ రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించారు. ఇక అండర్ -12 బాలికల విభాగంలో 6వ తరగతికి చెందిన బి. మీనాక్షి రాష్ట్ర స్థాయిలో తృతీయ బహుమతి సాధించింది. రాష్ట్ర స్థాయిలో బహుమతులు సాధించిన విద్యార్థులను ఎంజీఎం గ్రూప్ డైరెక్టరు గుద్దూరు ఐశ్వర్య అభినందించారు. ఈ సందర్భంగా గుద్దూరు ఐశ్వర్య మాట్లాడుతూ... ఎంజీఎం పాఠశాల విద్యార్థులను క్రీడల పట్ల ప్రోత్సహించడంలో తమ విద్యా సంస్థలు ముందుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్ వాడీ కేంద్రంలోకి వర్షపు నీరు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలం యర్రగుడిపాడు దళితవాడలో గల అంగన్ వాడీ కేంద్రంలోకి వర్షపు నీరు చేరడంతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వాన కురిసిన ఈ అంగన్ వాడీ కేంద్రంలోకి వర్షపు నీరు చేరుతోంది. ఈ కారణంగా వర్షాకాలంలో చిన్నారులకు కష్టాలు తప్పడం లేదు. ఈ దళితవాడ, గిరిజన కాలనీలో 149 కుటుంబాలు ఉన్నాయి. ఈ రెండు కాలనీలకు కలిసి దళితవాడలో 1995లో అంగన్ వాడీ భవనం నిర్మించారు. సుమారు మూడు దశాబ్దాల కిందట నిర్మించిన ఈ భవనం నేడు శిథిలావస్థకు చేరుకుంది. భవన పైకప్పు పెచ్చులు తరచూ చిన్నారులపై పడుతుంటాయి. ఈ అంగన్ వాడీ కేంద్ర పరిధిలో ప్రస్తుతం 0-6ఏళ్ల మధ్య వయసు గల చిన్నారులు 39మంది ఉన్నారు. ఇక ఇక్కడ నలుగురు గర్భవతులు, ఐదు మంది బాలింతలు ఉన్నారు. అంగన్ వాడీ కేంద్రంలోకి వర్షపు నీరు చేరడం వలన వీరందరూ ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఇకనైనా స్పందించి యర్రగుడిపాడు దళితవాడలో నూతన అంగన్ వాడీ కేంద్రం నిర్మించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

యూత్ ఆక్టివిటీస్‌లో విజేత స్కూల్ విద్యార్థులు ప్రతిభ

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : శ్రీరామ్ నగర్ కాలనీలో రోటరీ క్లబ్ వారిచే నిర్వహించిన యూత్ ఆక్టివిటీస్ కార్యక్రమంలో విజేత స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. నృత్య భాగంలో కె .శ్రావణి ప్రథమ బహుమతి పొందగా, పాటల పోటీల్లో కె.నీల్ గ్రీవ్ రెడ్డి ద్వితీయ బహుమతిని కైవసం చేసుకున్నారు. రోటరీ క్లబ్ వారిచే సర్టిఫికెట్స్ మెమెంటో‌తో గెలుపొందినందుకు డైరెక్టర్ కాయం సుబ్బరామిరెడ్డి విద్యార్థులను అభినందించి, వారికి బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రామ్ ఉమా సింగ్,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్లు, చెరువుల మరమ్మతుకు రూ.20కోట్లు అడుగుతాం

-ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో భారీ వర్షాలతో దెబ్బతిన్న రోడ్లు, చెరువుల మరమ్మతు కోసం రూ.20కోట్లు కావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు విన్నవించనున్నట్లు స్థానిక శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి తెలిపారు. శ్రీకాళహస్తి పట్టణంలోని పంచాయతీరాజ్ అతిథి గృహంలో గురువారం ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. నియోజకవర్గంలో భారీ వర్షాలకు దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించి తగు సహాయక చర్యలు తీసుకున్నామన్నారు. రైతులకు ఎక్కడైనా నష్టం వాటిల్లి ఉంటే పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆర్డీవో ను కోరినట్లు ఆయన తెలిపారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో భారీ వర్షాలకు దెబ్బతిన్న ప్రాంతాలను రెండు రోజులుగా తాను స్వయంగా పర్యటించి ప్రజలకు అండగా నిలిచామన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలో ముందస్తు జాగ్రత్తగా ప్రధాన డ్రైనేజ్ కాలవల్లో సిల్ట్ తొలగింపు పనులు చేయడం వల్ల ఎక్కడ కూడా ముంపు ప్రభావం కనబడలేదన్నారు. అవసరమైన చోట పునరావాస కేంద్రాలు ఏర్పా టు చేసి ఆదుకున్నామన్నారు. రేణిగుంట పట్టణంలోనూ అవసరమైన చర్యలు తీసుకుని... ఎక్కడా వర్షాలకు ఇబ్బందుల్లేని పరిస్థితి ఉండే విధంగా చేశామన్నారు. వర్షాలకు గ్రామీణ రోడ్లు. దెబ్బతిన్నా యని... కొన్ని చోట్ల చెరువులు కట్టలు దెబ్బతిన్నా యన్నారు. వీటి మరమ్మతుల కోసం ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేయిస్తా మన్నారు. ప్రస్తుతం పంటల సాగు ఇంకా జరగలేదని...అయితే ఎక్కడైనా రైతులు పొలాలు దెబ్బ తిని ఉంటే ఆర్డీవోను విచారణ జరిపి నివేదిక ఇవ్వమని కోరామన్నారు. అమెరికాలో రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందడం చాలా బాధాకరమన్నారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సంతాపం ప్రకటించారు. శ్రీకాళహస్తి ఆలయంలో దళారీ వ్యవస్థను సంపూర్ణంగా నివారించడానికి స్థానికులకు ఆధార్ కార్డు చూపించి దర్శనానికి వెళ్లే విధంగా వ్యవస్థను తీసుకువచ్చామని... ఇందులో స్థానికులకు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. మార్పులు కనుగుణంగా ముందుకు పోవాలని సూచించారు. ఈ విలేకరుల సమావేశంలో టిడిపి సీనియర్ నేత రంగినేని చెంచయ్య నాయుడు, టీడీపీ పట్టణ అధ్యక్షులు విజయకుమార్, కన్నలి ప్రతాపరెడ్డి, లక్ష్మనేని మధు బాబు, మదన్మోహన్ నాయుడు, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

ట్రూ అప్ చార్జీల భారం మోపొద్దు

విశాలాంధ్ర - తొట్టంబేడు: రాష్ట్ర ప్రజానీకంపై ట్రూ అప్ విద్యుత్ చార్జీల భారం మోపొద్దని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య డిమాండు చేశారు. పెంచిన ట్రూ అప్ ఛార్జీలకు వ్యతిరేకంగా శ్రీకాళహస్తి ఎస్పీడీసీఎల్ కార్యాలయం ఎదుట సీపీఎం నేతలు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం తమ ఖాజానాను నింపుకోవడం కోసం ట్రూ అప్ ఛార్జీల పేరిట వచ్చే పదేళ్లకు రాష్ట్ర ప్రజానీకంపై రూ. 8, 014 కోట్ల ఆర్థిక భారం మోపేందుకు చీకటి జీవో తీసుకురావడం సిగ్గుచేటన్నారు. ఓ వైపు ఉపాధి అవకాశాలు లేక కుటుంబాలను పోషించుకోవడానికి అపసోపాలు పడుతున్న సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై ట్రూ అప్ చార్జీల మోత మరింత భారం కానుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఈ జీవోను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి గంధం మణి, షరీఫ్, కుమార్, వేణు, వెలివేంద్రం, వెంకటేష్, అన్వర్ బాషా, రాజా తదితరులు పాల్గొన్నారు.

హై స్కూల్‌లో ఉచిత కంటిపరీక్షల నిర్వహణ

విశాలాంధ్ర - కార్వేటినగరం : జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల డీ.ఎం.పురం నందు శుక్రవారం 130మంది విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు.ప్రాథమిక ఆరోగ్యకేంద్రం కార్వేటినగరం పారామెడికల్ ఆప్తమలిక్ సుమలత హెచ్.ఎం కేశవులు ఆధ్వర్యంలో 3నుండి 10తరగతుల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు.6మంది విద్యార్థులకు లోపాలున్నట్లు గుర్తించామని కళ్ళ అద్దాలు అందించేలా తగు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు .సర్వేంద్రియానాం నయనం ప్రధానం కాబట్టి పచ్చని ఆకుకూరలు, తాజా కూరగాయలు ,పండ్లు ఆహారం లో విరివిగా ఉపయోగించి కంటి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరాన్ని విద్యార్థులకు వివరించారు.కార్యక్రమం లో డీ.ఎం.పురం ఆశ వర్కర్స్ అశ్విని,లీల మరియు వ్యాయామ ఉపాధ్యాయులు తిరుమల రాజు పాల్గొన్నారు.

రూ.25 లక్షలతో సీసీ రోడ్డుకు భూమి పూజ చేసిన ఎంపీడీవో

విశాలాంధ్ర - కార్వేటినగరం : మండల పరిధిలోని కేస కుప్పం పంచాయతీ పరిధిలో మర్రిమాను ఇండ్ల నుంచి ఎస్టి కాలనీ వరకు సిమెంట్ రోడ్డు నిర్మాణానికి 20 లక్షలు నిధులు మంజూరు అయిందని ఎంపీడీవో చంద్రమౌళి శుక్రవారం భూమి పూజ చేశారు. యమ విలాసం కుమ్మరకుంట నుండి చింత తోపు వరకు ఐదు లక్షల నిధులతో సిమెంటు రోడ్డుకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పల్లె పండుగ పంచాయతీలలో వారోత్సవాల్లో భాగంగా కార్వేటి మండలం మనకు మూడు కోట్ల 67 లక్షలతో 32 సిమెంట్ రోడ్ల పనులు మంజూర అయిందన్నారు. దీంతో గ్రామీణ రోడ్లంతా అద్దం లాగా తయారు కానున్నదని పేర్కొన్నారు.ఈ రోడ్లకు ఎన్ ఆర్ ఈజీఎస్ నిధులతో గ్రామీణ రోడ్లు బాగుండాలని ఉద్దేశంతో ప్రభుత్వంనిధులు మంజూరు చేసిందన్నారు. రోడ్లు నాణ్యతగా చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం అధ్యక్షులు నగలపాటి నాగేశ్వరరాజు,మండల పార్టీ అధ్యక్షులు ఎం చంగల్రాయ్ యాదవ్,మాజీ సర్పంచులు రవిరాజు, చిరంజీవి,గోపాల్,ఏపీవో జాహ్నవి, టి ఎ మోహన్, స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ ఏకాంబరం, రాఘవేంద్ర, పంచాయతీ కార్యదర్శి సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గోకులం షెడ్ల పురోగతిని పరిశీలించిన కడ పిడి వికాస్ మర్మత్

విశాలాంధ్ర - కుప్పం : కుప్పం మండలం గెరిగచిన్నేపల్లి, నూలుకుంట, మల్లానూరు గ్రామాల నందు గోకులం షెడ్ల పురోగతిని పరిశీలించారు. పూర్తయిన వాటిని సందర్శించి, లబ్ధిదారులతో కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ నేరుగా మాట్లాడారు. గోకులం షెడ్ల నిర్మాణ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా పార్టీ ప్రెసిడెంట్ ప్రేమ్ కుమార్, టిడిపి కార్యకర్తలు, సంబంధిత అధికారులైన ఏపీడి, డిడబ్ల్యూ ఎం ఏ వెంకటరమణ , ఏడి, అనిమల్ హస్బండ్రీ రెడ్డి కుమారి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కదిరి నరసింహస్వామి ఆలయంలో చోరీ

విశాలాంధ్ర-చౌడేపల్లి: మండలంలోని కాకి పేరు పంచాయతీ వడ్డివారిపల్లి వద్ద గల కదిరి నరసింహ స్వామి ఆలయంలో గురువారం రాత్రి చోరీ జరిగింది గుర్తుతెలియని వ్యక్తులు ఆలయ తలుపులు హుండీని బదలగొట్టి భారీ స్థాయిలో నగదును చోరీ చేశారని గ్రామస్తులు తెలిపారు. నాలుగేళ్ల క్రితం స్వామి వారి ప్రాణ ప్రతిష్ట జరిగిందని అప్పటినుంచి హుండీ లేపుక్కింపు నిర్వహించలేదన్నారు. హుండీలో అత్యధికంగా భక్తులు నగదును కానుకలుగా వేశారని గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించుకుని వెళ్లారని వారు అన్నారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

రాజుపల్లిలో 'పొలం పిలుస్తోంది'

విశాలాంధ్ర-పెద్దపంజాణి: వ్యవసాయ అనుబంధ శాఖల ద్వారా ప్రభుత్వం ప్రవేశపెట్టిన పొలం పిలుస్తోంది అనే కార్యక్రమం రాజుపల్లి రైతు సేవా కేంద్రం నందు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పట్టు పరిశ్రమ శాఖ ఏఎస్ఓ చౌదరి హాజరై పట్టు పరిశ్రమ శాఖ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు రైతులకు పంటలో చేపట్టాల్సిన మెలకువలు గురించి రైతులకు వివరించారు వ్యవసాయ ఏఎస్ ఏ బాలాజీ అనిల్ ఉద్యాన శాఖ రెహమాన్ పశు సంవర్ధక శాఖ మహేష్ మార్కెటింగ్ శాఖ శీనా అధికారులు భాగస్వామి శాఖల ద్వారా రైతులకు అందిస్తున్న కార్యక్రమాల గురించి అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి భాను ప్రతాప్ రెడ్డి బాలకృష్ణారెడ్డి మంజునాథరెడ్డి నాగరాజ్ యాదవ్ ప్రవీణ్ కుమార్, గణేష్పురం గోపాల్ అమర్నాథ్, జైపాల్ రెడ్డి చందు యాదవ్ ఏపీ మాస్ ప్రతినిధులు దేవిక, రమ్య పాల్గొన్నారు.

వసతి గృహాలకు కనీస సౌకర్యాలు కల్పించాలి

దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగరాజు

విశాలాంధ్ర-చిత్తూరు: జిల్లా కేంద్రమైన చిత్తూరు సాంఘిక సంక్షేమ హాస్టల్ లో విద్యార్థులకు సరైన వసతులు కరువడంతో చలికి వణుకుతూ వర్షానికి తడుస్తూ సరైన పరిశుభ్రత లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు . చిత్తూరులోని సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిగ్రీ హాస్టల్ దుస్థితి డిగ్రీ సాంఘిక సంక్షేమ వసతి గృహంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి విద్యనభ్యసిస్తున్న ఎస్సీ ఎస్టీ విద్యార్థులు 112 మంది హాస్టల్లో ఉంటున్నారు మీరు ఉంటున్న హాస్టల్ పూర్తిగా పాడైపోయింది కనీసం కిటికీలు అద్దాలు లేవు పగిలిపోయిన కిటికీలు వాటికి అడ్డంగా వస్త్రాలు కట్టుకొని విద్యార్థులు చలికి వణుకుతున్నారు ఇటీవల కురుస్తున్న వర్షాలకు విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నట్లు తెలిపారు. బాత్రూంలో మరుగుదొడ్లు కూడా సక్రంగా లేవని వెంటనే విద్యార్థులకు హాస్టల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

సిఎం చంద్రబాబుతో నేతల సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే బొజ్జల

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇన్ఛార్జులు, ముఖ్యనేతలతో ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం సమావేశం అయ్యారు. ఈ సమావేశంకు శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి హాజరయ్యారు. తెలుగుదేశం పార్టీ కీలక ప్రజాప్రతినిధులతో పార్టీ అధినేత, ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గత ఐదేళ్లలో రాష్ట్రంను వైసిపి సర్వనాశనం చేసిందని, ఆ పార్టీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నా రని చెప్పారు. దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన పార్టీ టిడిపి అని, భవిష్యత్తులో పార్టీని ఎలా ముందుకు తీసుకెళ్లాలనేది సమీక్షించారు. ప్రజలు గెలవాలి.. రాష్ట్రం నిలబడాలి అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్లి గెలిచామని. గెలిచాం మన పని అయిపోయిందని అనుకుంటే చాలా సమస్యలు వస్తాయని, ప్రజా ప్రతినిధులు నిత్యం ప్రజల్లోనే ఉండాలని ఎన్నికల సమయంలో ఉన్న పరిస్థితుల వల్ల పార్టీని నమ్ముకున్న కొంతమందికి సీట్లు ఇవ్వలేకపోయామని, న్యాయం చేస్తామని వారికి చంద్రబాబు హామీ ఇచ్చారు. ప్రజలు మనల్ని విశ్వసించారని, దాని ప్రకారం మనం ముందుకెళ్లాలని ఎమ్మెల్యే, ఎంపిలు, ముఖ్య నేతలకు సీఎం చంద్రబాబు సూచించారు.

ఎన్సిసితో క్రమశిక్షణ, ఉపాధి

విశాలాంధ్ర-పాకాల: ఎన్సిసి ద్వారా క్రమశిక్షణ అలవడటమే కాకుండా ఉపాధికి మార్గం కూడా లభిస్తుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మొహిద్దీన్ భాష తెలిపారు. శుక్రవారం స్థానిక పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇటీవల లెఫ్ట్ నెంట్ హోదా పొందిన అధ్యాపకులు డాక్టర్ ఈశ్వర బాబుకు కళాశాల ప్రిన్సిపాల్ మొహిద్దీన్ బాషా ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లెఫ్ట్ నెంట్ హోదా పొందడం సామాన్యమైన విషయం కాదని ఎంతో క్రమశిక్షణతో కృషి చేయడం వలన ఇది సాధ్యమైందని, విద్యార్థులు అందరూ ఆయనను ఆదర్శంగా తీసుకొని క్రమశిక్షణతో మెలగాలన్నారు. లెఫ్టినెంట్ హోదా పొందిన ఈశ్వర బాబును అభినందించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాల్మీకిపురం డిగ్రీ కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, పుత్తూరు డిగ్రీ కళాశాల ఎన్సిసి ఆఫీసర్ కెప్టెన్ శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపాల్ రమేష్ కుమార్, డిగ్రీ కళాశాల అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాఘవరెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వాసు, వెంకట కృష్ణయ్య వివిధ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

వార్డు సభ్యులు పంచాయతీ సమావేశాల్లో పాల్గొనాలి

విశాలాంధ్ర-సత్యవేడు: పంచాయతీ సమావేశాల్లో ఆయా ఉపసర్పంచులు, వార్డు సభ్యులు తప్పనిసరిగా పాల్గొనాలని స్థానిక జడ్పిటిసి విజయలక్ష్మి కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో చంద్రశేఖర్ పర్యవేక్షణలో ఉప సర్పంచ్లకు, ఇద్దరు వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న జడ్పిటిసి విజయలక్ష్మి మాట్లాడుతూ ఆయా వార్డు సభ్యుల పరిధిలో సమస్యలను తెలుసుకుని పంచాయతీ సమావేశాల్లో ప్రస్తావించాల్సిన బాధ్యత వార్డు సభ్యులపై ఉందన్నారు. పంచాయతీల అభివృద్ధిలో వార్డు మెంబర్ల పాత్ర చాలా కీలకమన్నారు. వార్డు మెంబర్లు కీలకంగా వ్యవహరిస్తూ పంచాయతీల అభివృద్ధికి చొరవ చూపాలన్నారు. ఎంపీడీవో చంద్రశేఖర్ మాట్లాడుతూ పంచాయతీ సర్పంచ్లకు సమానంగా వార్డ్ మెంబర్లకు కూడా రాజ్యాంగంలో హక్కులు కల్పించారని గుర్తు చేశారు. రాజ్యాంగ బద్ధంగా ప్రజల చేత ఎన్నుకోబడిన వార్డు మెంబర్లు తమకు రాజ్యాంగం కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకొని వార్డుల అభివృద్ధిలో తమదైన ముద్రవేయాలని కోరారు. అనంతరం ఉప సర్పంచ్లకు రాజ్యాంగం ద్వారా కలిపిన హక్కులు, వార్డు సభ్యుల విధులు బాధ్యతలు, పంచాయతీరాజ్ చట్టం, నిధుల వినియోగం తదితర పలు అంశాలపై పంచాయతీరాజ్ విస్తరణ అధికారి తరుణాక్ష రెడ్డి వివరించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు, పలువురు ఉప సర్పంచ్లు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో సిసి రోడ్లకు భూమి పూజ

విశాలాంధ్ర-ఏర్పేడు: కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా ఏర్పేడు మండలంలోని పాతవీరాపురం గ్రామంలో శుక్రవారం టిడిపి నేతలు అధికారులు సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. సుమారు పది లక్షల రూపాయలు నిధులతో ఈ గ్రామానికి సిసి రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు దీంతో టీడీపీ సీనియర్ నేత మాజీ జడ్పిటిసి సభ్యులు పేరం ధనంజయులు నాయుడు చేతుల మీదుగా భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సభ్యులు ముని రంగారెడ్డి నాయకులు ధర్మారెడ్డి, విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గర్భవతులకు పౌష్టికాహారం ఎంతో అవసరం

విశాలాంధ్ర-కార్వేటినగరం: గర్భవతులలో రక్తహీనతను తగ్గించడానికి పౌష్టికాహారం ఎంతో దోహదపడుతుందని ఐసీడీఎస్, సీడీపీవో పద్మసునంద అన్నారు. శుక్రవారం కొల్లాగుంట అంగన్వాడీ కేంద్రంలో గర్భవతులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడు తూ గర్భవతులు, బాలింతలు పోషకాలాహారం కలిగిన ఆహారాన్ని తీసుకో వడం వల్ల తక్తహీనత తగ్గి ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. సీ విటమిన్ పుష్కలంగా ఉన్న మునగాకు పొడి తీసుకోవడం వల్ల ఆరోగ్యాన్ని పదిలంగా పెట్టుకోవచ్చన్నారు. అనంతరం ఆకుకూరలతో పోషణ వేడుక కార్యక్ర మాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు శ్యామిని, ఇందిరా, భారతి, కార్యకర్త వల్లెమ్మ, పిల్లల తల్లిదండ్రులు పలువురు పాల్గొన్నారు.

గొర్రెలకు డీవార్మింగ్ నట్టల మందు పంపిణీ

విశాలాంధ్ర-రామకుప్పం: మండల పరిధిలోని బందార్ల పల్లి పంచాయతీకి చెందిన బిరుగుండ్లపల్లి గ్రామంలో శుక్ర వారం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఆనందరెడ్డి ఆధ్వర్యంలో పశు వైద్యాధికా రులు శివశంకర్ చంద్రశేఖర్ తదితరులుచే గొర్రెలు మేకలకు నట్టల నివారణ డీ వార్మింగ్ మందుల పంపిణీ ప్రక్రియను ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా సుమారు 27 వేల గొర్రెలు మేకలు ఉన్నాయని పెంపకం దారులు ప్రతి ఒక్కరూ విధిగా గొర్రెలు మేకల పెంపకం దారులు నట్టల నివారణ ముందస్తు చర్యల్లో భాగంగా డీ వార్నింగ్ మందులు వేయించి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీల నిర్మాణానికి నిధులు మంజూరు

సత్యవేడు గ్రామీణనీటిసరఫరాశాఖ డిఈ శైలజ

విశాలాంధ్ర-సత్యవేడు: సత్యవేడు ఆర్‌డబ్ల్యూఎస్ డివిజన్ పరిధిలో 12 డ్రైనేజీ నిర్మాణ పనులకు నిధులు మంజూరైనట్టు స్థానిక గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖ డిఈ శైలజ పేర్కొన్నారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లెపండుగ పంచాయతీ వారోత్సవాల్లో ఈ నిధులు మంజూరు అయిందన్నారు. ఇందులో భాగంగా సత్యవేడు మండలం జడేరు గ్రామంలో డ్రైనేజీ నిర్మాణానికి ఏడు లక్ష రూపాయలు, వరదయ్యపాలెం మండలం తొండంబట్టులో డ్రైనేజీకి ఏడు లక్షలు, మతేరిమెట్టకు ఐదు లక్షలు మంజూరైనట్టు ఆమె చెప్పారు. అలాగే నాగలాపురం మండలం చిన్నాపట్టులో డ్రైనేజీ నిర్మాణానికి ఐదు లక్షలు, నాగలాపురం పట్టణ పరిధిలో మూడు డ్రైనేజీ నిర్మాణ పనులకు 37 లక్షల 50 వేలు, వెల్లూరులో రెండు డ్రైనేజీ పనులకు ఐదు లక్షలు, వేంబాకంలో రెండు డ్రైనేజీ పనులకు ఆరు లక్షల రూపాయలు మంజూరు అయిందని ఆమె వివరించారు. ఈ పనులన్నీ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టడం జరుగుతుందన్నారు. ఇప్పటికే పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో కొన్ని డ్రైనేజీ పనులు ప్రారంభమైందన్నారు.

సాగులో ఉన్న భూములను సర్వే చేయించండి

తహసీల్దార్‌ను కోరిన బాధితులు

విశాలాంధ్ర-చౌడేపల్లి: దశాబ్దాల తరబడి తమ సాగులో ఉన్న భూములను సర్వే చేయించి చూపించాలని పలువురు రైతులు తాసిల్దార్‌కు మొరపెట్టుకున్నారు. మండలంలోని పెద్ద కుండా మారి పంచాయతీ గోవిందరాజు చెరువు సమీపంలో పెద్ద కున్నమారికి చెందిన నాలుగు కుటుంబాల వారు దాదాపు 40 ఏళ్ల నుంచి ప్రభుత్వం ఇచ్చిన 14 ఎకరాలను సాగు చేసుకుంటున్నామని తమ కుటుంబాల్లో 70 మంది అదే భూమిపై ఆధారపడి జీవిస్తున్నామన్నారు. అయితే తమ భూముల్లో కొందరు పట్టాలు చేయించుకుని అక్రమంగా చొరపాటు చర్యలు చేపడుతున్నారని లక్ష్మమ్మ వెంకట లక్ష్మమ్మ జ్యోతమ్మ లక్ష్మమ్మలు తహసీల్దార్ తో మొరపెట్టుకున్నారు. ప్రభుత్వం ఇచ్చిన సంబంధిత భూములను సర్వే చేయించి ఇప్పించాలని తహసీల్దార్ హనుమంతు నాయక్ కు వినతిపత్రం అందించారు విచారణ చేసి న్యాయం చేస్తామని ఆయన వారికి హామీ ఇచ్చారు.

పానాసోనిక్ పరిశ్రమ దాతృత్వంతో నూతన భవన నిర్మాణానికి భూమి పూజ

విశాలాంధ్ర-తడ: తడలోని పానాసోనిక్ పరిశ్రమ దాతృత్వంతో ఉపాధ్యాయుల శిక్షణ కార్యాలయం నూతన భవన నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. తడ మండల విద్యాశాఖ అధికారులు సరస్వతి, మల్లికార్జున రావుల ఆధ్వర్యంలో తడ మండల విద్యాశాఖ కార్యాలయ ఆవరణంలో ఈ భూమి పూజా కార్యక్రమాన్ని చేపట్టారు. సుమారు 20 లక్షల రూపాయల వ్యయంతో ఈ కార్యాలయాన్ని నిర్మించి ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఈ శిక్షణా కార్యాలయం భవనం పూర్తయినచో ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులతో పాటు ఉపాధ్యాయుల సమావేశాలకు ఉపయోగకరంగా వుంటుందని పలువు రు ఉపాధ్యాయులు అభిప్రాయ పడ్డారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈవో విజయ్ కుమార్ పానాసోనిక్ పరిశ్రమ ప్రతినిధులతో పాటు ఉపాధ్యాయులు నవీన్ కుమార్, ఉస్మాన్ బాషా, సుధాకర్ మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగిపై కౌన్సిలర్ దాడి

విశాలాంధ్ర-వెంకటగిరి: తిరుపతి జిల్లా వెంకటగిరి మున్సిపల్ పరిధిలోని తొమ్మిదవ సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ నేలపాటి సాయికుమార్ పై అవార్డు కౌన్సిలర్ దాడి చేశారని రాష్ట్ర ఉద్యోగుల సంఘం వెంకటగిరి నియోజకవర్గ అధ్యక్షులు చింతకుంట కృష్ణారెడ్డి తీవ్రంగా ఖండించారు. నీటి సమస్యపై ఇంజనీరింగ్ అసిస్టెంట్‌తో చరవాణిలో మాట్లాడిన కౌన్సిలర్ ఉగ్రరూపంతో అతనిపై హేతుబద్ధ చర్యకు పాల్పడడం బాధాకరమని ఉద్యోగుల సంఘం ట్రెజరర్ గంజి అశోక్ కుమార్పేర్కొన్నారు. కేవలం నీటి సమస్య పరిష్కరించడానికి కమిషనర్ లేనందున ఉన్నత అధికారులు దృష్టికి తీసుకు వెళ్తానని చెప్పిన ఉద్యోగానికి లోనై వికలాంగుని నాపై దాడి చేసి గాయపరచడం జరిగిందని బాధితుడు వాపోయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి నిబద్ధత లేని చర్యలపై స్థానిక ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్ దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట డిమాండ్ చేశారు అంత మునుపు బాధితుల్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

విశాలాంధ్ర-బుచ్చినాయుడుకండ్రిగ: కూటమి ప్రభుత్వంతోనే గ్రామీణ అభివృద్ధి సాధ్యపడుతుందని కూటమి నాయకులు తెలిపారు. మండలంలో శుక్రవారం తొమ్మిది పంచాయతీ పరిధిలో పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. పార్లపల్లి, పల్లమాల, భవాని శంకరాపురం, కొత్తపాలెం, ఆలత్తూరు, పివి కండ్రిగ, పుత్తేరి, కాటూరు, తిమ్మ భూపాలపురం, గ్రామాలలో సుమారు రెండు కోట్ల రూపాయలకు భూ పూజ నిర్వహించారు, ఈ సందర్భంగా టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు మామిళ్ళపల్లి సుధాకర్ నాయుడు మాట్లాడుతూ, పల్లె పండుగ కార్యక్రమం ద్వారా పంచాయితీల అభివృద్ధిని ప్రోత్సహించడంతో పాటు, గ్రామ ప్రజల మధ్య పరస్పర సంబంధాలను పెంపొందించడానికి, దోహదపడుతుందని పేర్కొన్నారు. గ్రామాలలో మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేసుకోవడానికి మెరుగుపరిచేందుకు పెద్ద పునాది వేస్తుందన్నారు. దీనివల్ల గ్రామాల్లో నీటి, రవాణా, వ్యవసాయ వంటి రంగాలలో గణనీయమైన మార్పులు చోటు చేసుకుంటుందన్నారు. అంతేకాకుండా, ఈ పల్లె పండుగ కార్యక్రమం ప్రజలలో భాగస్వామ్యాన్ని పెంచి, గ్రామాల్లో ఆర్థిక వనరుల సృష్టించడంలో కూడా దోహదపడుతుందన్నారు. ప్రభుత్వ ఉద్దేశాలను సమర్థంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ద్వారా అన్ని సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. పల్లె పండుగ కార్యక్రమం ద్వారా అనేకమైన అభివృద్ధి కార్యక్రమాలు ప్రభుత్వం చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో త్రివిక్రమ్ రావు తుమ్మల కన్నయ్య నాయుడు, మధు నాయుడు, రవి నాయుడు, సుబ్రహ్మణ్యం, దాము, ఆయా గ్రామాల కార్యకర్తలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు దిగుతాం

విశాలాంధ్ర-ఓజిలి: సమస్యలు పరిష్కరించుకుంటే సమ్మెకు దిగుతామని డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాసులు హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్య సేవ సిబ్బందికి 17 సంవత్సరాలు సర్వీస్ పరిగణములోనికి తీసుకొని క్యాడర్ కల్పించి సమాన పనికి సమాన వేతనం అమలు చేస్తూ ప్రభుత్వ కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించాలని శ్రీనివాసులు డిమాండ్ చేశారు. చనిపోయిన సిబ్బందికి 15 లక్షల రూపాయలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలన్నారు. పదవి విరమణ అవుతున్న ఇబ్బందికి 10 లక్షల రూపాయలు గ్రాట్యూటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ వైద్య సేవ పథకాన్ని ఇన్సూరెన్స్ పథకంలోనికి మార్పు చేసిన పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ సిబ్బందికి న్యాయం జరగడం లేదన్నారు. ప్రభుత్వాలు మారుతున్న ఎన్టీఆర్ వైద్య సేవ సిబ్బంది జీవితాలు మారడం లేదన్నారు. మా సమస్యలను సంబంధిత అధికారు లకు ప్రజా ప్రతినిధులకు తెలియపరిచిన పట్టించుకునేవారు కరువయ్యారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి మా న్యాయమైన సమస్య లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. పరిష్కరించకపోతే సమ్మెకు దిగుతామని శ్రీనివాసులు హెచ్చరించారు.

పల్లె పండుగలో రూ.26 లక్షలతో సీసీ రోడ్డుకు భూమి పూజ

విశాలాంధ్ర-వరదయ్యపాలెం: రాష్ట్ర ప్రభుత్వం పల్లెపండుగ - పంచాయతీ వారోత్సవాలు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న విషయం విధితమే. ఇందుకోసం 4500 కోట్లు రూపాయలు వెచ్చిస్తున్నారు. అందులో భాగంగా వరదయ్యపాలెం పంచాయతీ గోపాలరావు కాలనీ, బీసీ కాలనీలలో సుమారు 26 లక్షల వ్యయంతో సిమెంట్ రోడ్డు నిర్మాణం కొరకు శుక్రవారం గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు. కూటమి ప్రభుత్వం గ్రామాభివృద్ధి కొఱకు ఈ నిర్ణయం తీసుకోవడం హర్షనీయం అని క్లస్టర్ ఇన్‌చార్జి పన్నెం నిర్మల్ అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచ్ బొప్పన చంద్రబాబు, ఈఓ బసిరెడ్డి, మాజీ ఎంపీపీ బొందు భారతి, వార్డు సభ్యులు దొడ్డి సిద్దులయ్య, మునిభూషణమ్మ, పఠాన్, కూటమి నాయకులు వెంకటేష్, గుత్తి త్యాగరాజు, నవాబ్, నాగరాజు యాదవ్, శివయ్య, విజయ్ కుమార్, గుమ్మడి, ఉపాధి హామీ సిబ్బంది, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనాధ పిల్లలకు చేగు ప్రశాంత్ గుప్తా అన్నదానాలు

విశాలాంధ్ర-చంద్రగిరి: అనాధ పిల్లలకు, వృద్ధులకు, అన్నదానాలు, సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా రాయల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్, చేగు గ్రూపు సంస్థల అధినేత, వైసిపి వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు చేగు ప్రశాంత్ గుప్తా తన జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. తమ అభిమాన నాయకుడు, ఆత్మీయ అన్నయ్య జన్మదిన వేడుకలను టీమ్ చేగు సభ్యులు నిరాడంబరంగా జరుపు కున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం చేగు ప్రశాంత్ గుప్తా తిరుణ్ణామలైలోని ఆలయ పరిసరాలలోని నాలుగు ప్రదేశాలలో భక్తులకు అన్నదానం, మదనపల్లిలో ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదానం, భద్రాచలం ఏజెన్సీలో టీమ్ చేగు సభ్యుడు ఉడిపి రాజు ఆధ్వర్యంలో గిరిపుత్రులకు దుప్పట్లు, అన్నదానం, చంద్రగిరి నాగయ్యగారిపల్లి వద్ద గల అరుణోదయా వృద్ధాశ్రమంలో వృద్ధులకు టీమ్ చేగు సభ్యుడు జిల్లా జనార్ధన్ రెడ్డి అన్నదానం, బెంగుళూరు లోని ఆడిస్గొండట్టిలో గల సింఫోణి ఆశ్రమంలో ప్రత్యేక ప్రతిభావం తులు, వృద్ధులకు స్థానిక సింగేణీ ఆగ్రహార సర్పంచ్ ఎస్.కె. గౌరీష్ ఆధ్వర్యంలో అన్నదానం జరిపించారు. తన పుట్టిన రోజున సుమారు 3 వేల మందికి పైగా వివిధ ప్రాంతాలలోని అభాగ్యులకు అన్నదానాలు. సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతృప్తి నిచ్చిందన్నారు. ఈ సందర్భంగా అభిమానులు, స్నేహితులకు, టీమ్ చేగు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి, ఆదినారాయణ రెడ్డి, గురుమూర్తి రెడ్డి, వినోద్ రెడ్డి, గుణసాయి, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడి కేంద్రం తనిఖీ

విశాలాంధ్ర-రొంపిచెర్ల: మండలంలోని మోటమల్లెల గ్రామపం చాయితీలోని అంగన్ వాడి కేంద్రాలను ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడిలకు సరఫరా చేస్తున్న పోషికాహారాన్ని గర్భవతులకు పిల్లలకు క్రమం తప్పకుండా ఇవ్వాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలు తక్కువగా ఉన్నారని సంఖ్య పెంచాలని అన్నారు. 0-5 సంవత్సరాల మధ్య ఉన్న పిల్లలు అందరూ అంగన్వాడీ కేంద్రాల్లో ఉండాలన్నారు. పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి అంగన్వాడి కేంద్రాలను బలోపేతం చేయాలని సూచించారు. మోట మల్లెల, నగిరి, బాలనాగిరెడ్డిగారిపల్లి అంగన్వాడి లను తనిఖీ చేసి పలు సూచనలు ఇచ్చారు. అలాగే మోటమల్లెల, నగిరి, బాలనాగి రెడ్డి గారి పల్లె, ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. మధ్యాహ్నం భోజనం పథకాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

దివ్యాంగులైన పిల్లలకు ప్రత్యేక భవిత కేంద్రాలు

విశాలాంధ్ర-రొంపిచెర్ల: నిర్దిష్ట అభ్యాస వైభల్యాలపై రొంపిచెర్ల పురవీధులలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీనివాసులు మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రత్యేకంగా భవిత కేంద్రాల ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. దీని ద్వారా విద్యతో పాటు సంపూర్ణ ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన వాటి గురించి నేర్పించడం జరుగుతుందన్నారు. పిల్లలను భవిత కేంద్రాలకు తీసుకొని వచ్చేవారికి కూడా రవాణా చార్జీలను చెల్లించడం జరుగుతుందన్నారు. దివ్యాంగులకు ప్రభుత్వం వారికి పరికరాలను ఉచితంగా అందజేస్తుందని అన్నారు. ఈ అవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు లక్ష్మీదేవి, భవితా కేంద్రం ఉపాధ్యాయులు అమ్ములు తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడు అరెస్ట్

విశాలాంధ్ర-రొంపిచెర్ల: మహిళపై జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు కల్లూరి సీఐ సూర్యనారాయణ తెలిపారు. సిఐ కథను మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రొంపిచెర్ల గ్రామపంచాయతీ వారణాసి వారి పల్లికి చెందిన రోజా 30 గత నాలుగు రోజుల క్రితం పొలం వద్ద ఆవుల మేపుకుంటూ ఉండగా అదే గ్రామానికి చెందిన ప్రవీణ్ కుమార్ 21 మూడు రోజులుగా కూలీ పనులకు పోవడంలేదని మందలించారు. ఇది అవమానంగా భావించిన ప్రవీణ్ కుమార్ బీరు సీసాలతో ఆమె దాడి చేసి గాయపరిచారు. కాళ్లు చేతులు, గొంతు, మీద ముక్కలు ముక్కలుగా కోశాడు .దీంతో ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కల వాళ్ళు వచ్చి ఆమెని రక్షించారు. ఈ సంఘటనలో రోజా తీవ్ర గాయాలు అయ్యాయి. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడు ప్రవీణ్ కుమార్ గురువారం వారి ఇంట్లో ఉండగా అదుపులోకి తీసుకొని విచారించడం జరిగింది. ఈ కేసులో నిందితుడిని అరెస్టు చేసి పీలేరు కోర్టులో తరలించగా జడ్జి రిమాండ్ కు ఆదేశించినట్లు సిఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ మధు, బాలు, రవి, వేణు తదితరులు పాల్గొన్నారు.

కాలువను సర్వేచేసి హద్దులు ఏర్పాటుచేయండి

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం పాతకాల్వ చెరువు నుంచి ఇతర చెరువులకున్న సప్లై చానళ్లను సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని పాతకాల్వ టీడీపీ నాయకులు శివకుమార్ ఆధ్వర్యంలో తిరుపతి రూరల్ తహసీల్దార్ రామాంజులు నాయక్‌కు శుక్రవారం వినతి సమర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ సి.మల్లవరం పంచాయతీలోని సప్లై చానల్ ద్వారా పాతకాల్వ, సీ.గొల్లపల్లి, రామానుజపల్లి, తుమ్మలగుంట గ్రామాలకు గొలుసుకట్టు సప్లై చానళ్లు ఉన్నాయని తెలిపారు. గతంలో సీ.మల్లవరం వద్ద ఉన్న సప్లై చానల్ నుంచి పలు చెరువులకు నీళ్లు చేరేవన్నారు. ప్రస్తుతం ఈ కాలువలు కబ్జాకు గురయ్యాయని, వీటిని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. భారీ వర్షాలు వస్తే చెరువుల్లోకి ఈ చానళ్ల ద్వారా నీళ్లు చేరితే రైతులకు వ్యవసాయానికి, ప్రజలకు తాగునీటికి ఇబ్బంది ఉండదన్నారు. ఈ సమస్యపై ఎమ్మెల్యే పులివర్తి నానికి వినతి ఇచ్చామన్నారు. స్పందించిన ఆయన తహసీల్దారు, ఇరిగేషన్ అధికారులు లేఖరాసి వెంటనే తగు చర్యలు తీసుకోవాలని కోరారని తెలిపారు.

చెంగాలమ్మ దేవస్థానాన్ని సంయుక్త కమిషనర్ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-సూళ్లూరుపేట: తిరుపతి జిల్లా, సూళ్ళూరుపేట శ్రీ చెంగాలమ్మ పరమేశ్వరి అమ్మవారి దేవస్థానమును మల్టీ జోన్, శ్రీ ప్రాంతీయ సంయుక్త కమిషనరు, చంద్రశేఖర్ ఆజాద్ ఆకస్మికంగా రికార్డులను తనిఖీ చేయుట జరిగింది. సహాయ కమిషనరు కార్యనిర్వాహణాధికారి బి.ప్రసన్నలక్ష్మికి దేవస్థానమునకు సంబంధించి ప్రసాదములు మరియు పూజలు, సేవలు, ఇతర విషయములపై సూచనలు, ఆదేశములు జారీచేయుట జరిగినది.

ఆలయంపై తప్పుడు కథనాలపై సెక్యూరిటీ అభ్యంతరం

గతేడాది సంఘటనను ఇప్పుడు ముడిపెట్టడంపై అభ్యంతరం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: గత ప్రభుత్వ హయాంలో ఆలయంలో జరిగిన ఓ సంఘటనను ఇప్పుడు జరిగినట్లు ముడిపెడుతూ ఓ పత్రిక కథనం ప్రచురించడంపై ఆలయ సెక్యూరిటీ తీవ్ర స్థాయిలో మండిపడింది. ఇలాంటి తప్పుడు కథనాలు రాసిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. శుక్రవారం ఉదయం సెక్యూరిటీ సిబ్బంది మాట్లాడుతూ గతేడాది వైకాపా ప్రభుత్వ హయాంలో మద్యం సేవించి మాంసహారం తింటున్నట్లు అప్పట్లో సామాజిక మాధ్యమాల ద్వారా వైరల్ అయ్యిందని, ఇప్పుడు అదే కథనాన్ని ఇప్పుడు జరిగినట్లు ప్రచారం చేయడం మంచి పద్ధతి కాదని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. పత్రిక విలువలను పూర్తిగా దిగజార్చేలా కథనాలు రాసి ఆలయ పరువు మర్యాదాలను మంటగలుపుతున్న వ్యక్తులపై ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేశామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆలయాన్ని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసి దళారీల వ్యవస్థను అరికట్టారని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఆలయ ఆదాయం పెంచేలా చర్యలు తీసుకోవడమే కాకుండా భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. జీతాల ఆలస్యమైనాఎంతో కష్టపడి విధులు నిర్వహిస్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా విధులు నిర్వహిస్తున్నామని ఈ సందర్భంగా తెలియజేశారు. సెక్యూరిటీ సూపర్‌వైజర్ శ్యామ్‌పై వచ్చిన నిరాదరణల ఆరోపణలను ప్రచారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. జనసేన యువనేత మహేష్ మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వ హయాంలో జరిగిన సంఘటనను ఇప్పుడు జరిగినట్లు తప్పుడు ప్రచారం చేయడం మంచి పద్ధతి కాదన్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో సెక్యూరిటీ వ్యవస్థను భ్రష్టు పట్టించారని ఆ పార్టీతో అంటకాగి, ప్రచారాలు సైతం వారిని కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తొలగించడం జరిగిందని కొంతమంది పనికట్టుకుని ప్రచారం చేయడం తగదన్నారు.

బోయకొండ గిరిపై ఆవుల రామచంద్రయ్య గురి

- అధిష్టానం ఆశీస్సులు ఉన్నాయన్న ధీమా

విశాలాంధ్ర-చౌడేపల్లి: శక్తి క్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయ చైర్మన్ పదవి పై మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ బీసీ నాయకుడు ఆవుల రామచంద్రయ్యను వరిస్తుందన్న ధీమాను వ్యక్తం చేస్తున్నారు పార్టీ ఆవిర్భావం నుంచి తాను కష్టపడుతున్నానని దీంతో అధిష్టానం తన వైపే మొగ్గు చూపుందని ఆయన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు ఈ మేరకు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డి(చిట్టి) పుంగనూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి చల్లా రామచంద్రారెడ్డి ఆశీస్సులు తనకే ఉన్నాయని వారి సిఫారసు లేఖను ఇటీవల రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి అందించి బోయకొండ చైర్మన్ పదవి కోరినట్లు ఆవుల రామచంద్రయ్య వివరించారు పుంగనూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు తన సేవలను గుర్తించి అధిష్టానం తనకే బోయకొండ పదవి కట్ట పెడుతుందన్న ధీమాతో ఆయన ఉన్నారు. అంతేకాకుండా పుంగనూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి చల్లా రామచంద్రారెడ్డి చౌడేపల్లి మండల అధ్యక్షుడు గువ్వల రమేష్ రెడ్డిలతో పాటు మండలంలోని పార్టీ శ్రేణుల మద్దతు తనకే ఉన్నందున అధిష్టానం బోయకొండ గంగమ్మకు సేవ చేసుకునే భాగ్యం కల్పిస్తుందన్న ఆశ భావాన్ని ఆయన వ్యక్తం చేస్తున్నారు.

నిర్దిష్ట అభ్యాస వైకల్యాలపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-సూళ్లూరుపేట: స్థానిక సూళ్లూరుపేటలోని గవర్నమెంట్ హై స్కూల్ ఆవరణలో ఉన్న భవిత సెంటర్ లో డిస్లెక్సియా గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగినది. అంతేకాకుండా సూళ్లూరుపేట పట్టణ మంతా విద్యార్థులతో నిర్దిష్ట అభ్యాస వైకల్యాలు పై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా, భవిత కేంద్రం సహిత విద్య ఉపాధ్యాయురాలు భార్గవి మాట్లాడుతూ చదువులో వెనకబడిన విద్యార్థులు ఎవరైతే ఉన్నారో వారిలో అభ్యసనలో ఐదు రకాలకు సంబంధించి లోపాలు ఉంటాయని, ఆ వైఫల్యాలను ప్రత్యేక శిక్షణ ద్వారా సరిదిద్దవచ్చుని, వారిని ఎవరూ తక్కువ చేసి చూడకూడదని, డిస్లెక్సియాతో ఉన్న వారిలో చాలా మంది సగటుకు మించిన మేధస్సును కలిగి ఉండి, సమస్యలను పరిష్కరించే సామర్థ్యాలను అధిక స్థాయిలో చూపుతారని, ఈ విద్యార్థులు ముద్రించబడిన పుస్తకాలను చదవడం లేదా చేతితో రాయడం వంటి పనుల్లో సమస్యలను ఎదుర్కొంటారు. అయితే, కంప్యూటర్ వంటి డిజిటల్ పరికరాలను ఉపయోగించడం, వాటిలోని అప్లికేషన్ల సాయంతో వారు ఈ అడ్డంకులను అధిగమించవచ్చు. వారికి సరైన మద్దతు లభిస్తే వారు విద్యతో పాటు వృత్తిపరంగా విజయవంతం అవుతారని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గవర్నమెంట్ హై స్కూల్ ఉపాధ్యాయులు ఈ.శ్రీనివాసులు, భవిత సెంటర్ ఉపాధ్యాయులు, ఎన్.సాయి సంధ్య, ఆయా పి.సుజాత, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సబ్ స్టేషన్‌కు మరమ్మతులు: ఎడిఇ చంద్రబాబు

విశాలాంధ్ర-కార్వేటినగరం: డివిజన్ పరిధిలోని సబ్‌స్టేషన్లో మారమ్మత్తులు చేపడుతున్నట్లు విద్యుత్ ఎడిఇ చంద్రబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఎడిఇ మాట్లాడుతూ ఉదయం 9 గంట నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ మారమ్మతు కారణంగా సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించగలరన్నారు.

గ్రామాలను అభివృద్ధి పథం వైపు నడపడానికి విధులు, బాధ్యతలు తెలుసుకోవాలి

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: గ్రామ పంచాయతీలలో ఉప సర్పంచ్ లు,వార్డ్ సభ్యులు వారి గ్రామాల అభివృద్ధికి చేపట్టాల్సిన విధులు,బాధ్యతలు తెలుసుకున్నప్పుడే గ్రామాలను అభివృద్ధి పథం వైపు నడపవచ్చని ఎంపీడీవో కె.రామచంద్ర అన్నారు. తిరుపతి రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల పరిధిలోని 34 గ్రామ పంచాయతీలలోని ఉప సర్పంచ్ లకు, ఇద్దరు వార్డు సభ్యులకు గ్రామ పంచాయతీ వ్యవహారాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణా తరగతులు పంచాయతీ పాలన, ఆదాయ వనరులు, పారిశుధ్యం, వీధిలైట్ల నిర్వహణ, మంచినీరు, గ్రామ సభలు గురించి శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణా కార్యక్రమానికి ఎంపీపీ వేముల యశోద,ఎంపీడీవో కె.రామచంద్ర, ఈఓపీఆర్డీ ఆర్.మాధురి, పంచాయతీ కార్యదర్శులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు హాజరయ్యారు.

నిర్దిష్ట అభ్యాస వైకల్యాలపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-చౌడేపల్లి: స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయ ఆవరణలో ఉన్న భవిత సెంటర్ విద్యార్థులకు సంబంధించి నిర్దిష్ట అభ్యాస వైకల్యాలు పై అవగాహన ర్యాలీ జరిగినది. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారులు కేశవ రెడ్డి తిరుమలమ్మ లు ముఖ్య అతిథిలుగా హాజరయ్యి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు ప్రసంగిస్తూ చదువులో వెనకబడిన విద్యార్థులను ఎవరైతే ఉన్నారో వారిలో అభ్యసనలో నాలుగు రకాలకు సంబంధించి లోపాలు ఉంటాయని, ఆ వైఫల్యాలను ప్రత్యేక శిక్షణ ద్వారా సరిదిద్దవచ్చని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, భవిత సెంటర్ విద్యార్థులు పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు, చౌడేపల్లి ఐఈ డిఎస్ఎస్ బాలాజీ, భవిత సెంటర్ ఉపాధ్యాయులు, రామ మోహన్, నరేష్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు.

సిసి రహదారికి భూమి పూజ

విశాలాంధ్ర-చిల్లకూరు: కమ్మవారి పాళెం గ్రామ పంచాయతీలో, తెలుగుదేశం నాయకులు పఛ్ఛా వెంకటేశ్వర్లు నాయుడు ఆధ్వర్యం లో ఐదు లక్షల రూపాయల అంచ నాలతో సిసి రహదారి నిర్మాణం కోసం భూమి పూజ కార్యక్రమం శుక్రవారం జరిగింది. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో ఈ రహదారి నిర్మాణం జరుగుతుంది. పంచాయతీ రాజ్ ఎఇ ఇలియాజ్, ఎపివో ఉపాధి గిరిబాబు, పంచాయతీ కార్యదర్శి, సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్, ఉపాధి ఎఫ్ఎ, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలు మేకలకు డి వార్మింగ్ మందు

విశాలాంధ్ర-చౌడేపల్లి: చౌడేపల్లి పరిధిలోని చిట్టి రెడ్డి పల్లి లో గొర్రెలు మేకలకు డి వార్మింగ్ మందును వేయించారు. పశు వైద్యాధికారి డాక్టర్ పవన్ కుమార్ ఆధ్వ ర్యం లో మండలంలోని అన్ని గ్రామాలకు డి వార్మింగ్ మందును పంపిణీ చేశారు డి వార్మింగ్ చేయడం వల్ల జీవాల వృద్ధి చెందుతాయని ఆయన అన్నారు అనం తరం చిట్టెడ్డిపల్లిలో 120 జీవాలకు మందును వేయించారు ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు

విశాలాంధ్ర - గంగాధర నెల్లూరు: రీ సర్వేలో రెవిన్యూ సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు అని తాసిల్దార్ చంద్రశేఖర్ అన్నారు ఆయన మాట్లాడుతూ రైతులకు రీ సర్వేలో ఏమైనా సమస్యలు ఉంటే గ్రామ సభల్లో ఫిర్యాదు చేయవచ్చునని అన్నారు. రైతుల ద్వారా వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఎక్కడ ఎటువంటి అక్రమాలకు తావు లేకుండా రెవిన్యూ సిబ్బంది పనిచేయాలన్నారు గ్రామ సభలు జరిగి రెండు రోజులు ముందే దండోరా ద్వారా రైతులకు తెలియజేస్తామన్నారు.

విద్యాశాఖ అధికారులు తీరు మార్చుకోండి: ఎంపీపీ

ఇలానే కొనసాగితే పరిణామాలు తప్పవని హెచ్చరిక

విశాలాంధ్ర-పెద్దపంజాణి: మండలంలోని విద్యాశాఖ అధికారులు తీరు మార్చుకోవాలని ఎంపీపీ రెడ్డప్ప విద్యాశాఖ అధికారులను తీవ్రస్థాయిలో మండిపడ్డారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు విద్యాశాఖ రాగానే ప్రజా ప్రతినిధులు మండల విద్యాశాఖ అధికారుల తీరుపై ధ్వజమెత్తారు. మండలంలో ప్రభుత్వ పాఠశాలలు బలహీన పడుతున్నాయని కొన్ని పంచాయతీలలో పాఠశాలలు మూసే పరిస్థితి నెలకొందని అందుకు కారణం మండల విద్యాశాఖ అధికారులు తీరుని ప్రజాప్రతినిధులు నిలదీశారు. దీంతో ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వము ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతుంటే విద్యార్థుల సంఖ్య ఎందుకు తగ్గుతుందని ప్రశ్నించారు. అంతేగాక మధ్యాహ్నం భోజనం మరియు పాఠశాలలో మరుగుదొడ్లు త్రాగునీటి సౌకర్యాలు ఎక్కడ సరిగా లేవని ఇందుకు పూర్తి బాధ్యత విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లోపమేనని ఇలాగే ఉంటే మండలంలో ప్రభుత్వ పాఠశాలలో పూర్తిస్థాయిలో మూతబడి పోయే ప్రమాదం ఉందని ఆయన మండిపడ్డారు. ఇకనైనా తీరు మార్చుకుని పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని వారిని తీవ్రంగా హెచ్చరించారు. అనంతరం ఎంపీడీవో బాలాజీ మాట్లాడుతూ మండలంలో ఎస్టీలు ఆధార్ కార్డులు లేనివారికి మరియు జనన ధ్రువీకరణ పత్రం లేని వారికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వారికి అందజేస్తారని ఆయన తెలిపారు. కావున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే అన్ని శాఖలు విధిగా తమ పనులు పూర్తిస్థాయిలో నిర్వహించి ప్రజలకు నిష్పక్షపాతంగా సేవలు అందించాలని ఆయన తెలియజేశారు. ఈ సర్వసభ్య సమావేశానికి వైసీపీకి చెందిన 11 మంది ఎంపీటీసీలు గైర్హాజరు అవ్వడం గమనార్హం. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి రాజీబా, వైద్యాధికారి మురళితోపాటు అన్ని శాఖల అధికారులు మరియు సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పల్లె పండుగలో సీసీ రోడ్డుకు భూమి పూజ

విశాలాంధ్ర-వరదయ్యపాలెం: రాష్ట్ర ప్రభుత్వం పల్లెపండుగ -పంచాయతీ వారోత్సవాలు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న విషయం విధితమే. ఇందుకోసం 4500 కోట్లు రూపాయలు వేచిస్తున్నారు. అందులో భాగంగా వరదయ్యపాలెం పంచాయతీ గోపాలరావు కాలనీ, బీసీ కాలనీలలో సుమారు 26 లక్షల వ్యయంతో సిమెంట్ రోడ్డు నిర్మాణం కొరకు శుక్రవారం నాడు గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం గ్రామాభివృద్ధి కొరకు ఈ నిర్ణయం తీసుకోవడం హర్షనీయం అని క్లస్టర్ ఇంచార్జి పన్నెం నిర్మల్ అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచ్ బొప్పన చంద్రబాబు, ఈట బసిరెడ్డి, మాజీ ఎంపీపీ బొందు భారతి, వార్డు సభ్యులు దొడ్డి సిద్దులయ్య, మునిభూషణమ్మ, పఠాన్, కూటమి నాయకులు వెంకటేష్, గుత్తి త్యాగరాజు, నవాబ్, నాగరాజు యాదవ్, శివయ్య, విజయ్ కుమార్, గుమ్మడి, ఉపాధి హామీ సిబ్బంది, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

విశాలాంధ్ర-తడ: పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా తడ మండల పరిధిలోని కాదలూరు పంచాయతీ కట్టువ గ్రామంలో శుక్రవారం 20 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించే సిమెంట్ రోడ్డుకు, డ్రైనేజీ పనులలో భాగంగా సిమెంట్ రోడ్డు కు భూమి పూజ కార్యక్రమాన్ని చేపట్టారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పల్లెలను ప్రగతి పథంలో నడిపించేందుకు ప్రవేశపెట్టిన పల్లె పండుగ ప్రగతికి అండగా అనే కార్యక్రమంలో భాగంగా కాదులూరు పంచాయతీ కట్టువ గ్రామంలో 20 లక్షల రూపాయల వ్యయంతో సిమెంట్ రోడ్లు డ్రైనేజి నిర్మాణాలకు స్థానిక శాసన సభ్యులు నెలవల విజయశ్రీ నిధులు మంజూరు చేసి గ్రామ అభివృద్ధికి తోడ్పడ్డారు. ఈ భూమి పూజ కార్యక్రమాన్ని స్థానిక ఎంపీడీవో విజయ్ కుమార్ సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రామ్మూర్తి, మాజీ సర్పంచ్ చంద్రయ్య గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల భారాలకు వ్యతిరేకంగా నిరసన

విశాలాంధ్ర-నాయుడుపేట: మూడు విద్యుత్ పంపిణీ సంస్థలు 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 4 త్రైమాసికాల 8,114 కోట్ల రూపాయల ఎఫ్‌పిపిసిఎ (ఇంధన సర్దుబాటు చార్జీలు) ప్రతిపాదనలను అనేక నెలల క్రితమే విద్యుత్ నియంత్రణ మండలికి పంపినప్పటికీ అసెంబ్లీ ఎన్నికల ముందు వీటిపై ప్రజాభిప్రాయం తీసుకోకుండా జాప్యం చేయడం సరికాదని, విద్యుత్ చార్జీలపెంపునకు వ్యతిరేకంగా శుక్రవారం ఉదయం 12 గంటలకు నాయుడుపేట ఎస్.పి.డి సి.ఎల్ కార్యాలయం వద్ద నాయుడుపేట పట్టణ సిపిఎం కార్యదర్శి ఎస్ మహేష్ బాబు ఆధ్వర్యంలో సిపిఎం నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ నాయుడుపేట కార్యదర్శి మహేష్ బాబు ముకుంద మాట్లాడుతూ వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించాల్సిన మండలి ట్రూఅప్ చార్జీలపై నిర్ణయం తీసుకోకుండా ఇప్పటివరకు కాలయాపన చేయడం సమంజసం కాదన్నారు.నిబంధనలకు విరుద్ధంగా హిందూజా సంస్థకు (హెచ్ఎన్‌పిసిఎల్) రూ.1,234.68 కోట్లు విద్యుత్ సంస్థలు చెల్లించడం అన్యాయం అన్నారు. ఈ భారాన్ని కూడా ట్రూఅప్ ప్రతిపాదనలలో కలపడం శోచనీయంఅన్నారు.ఈ అక్రమ చెల్లింపుపై మండలి ముందు సిపిఎం గతంలో పలుసార్లు లేవనెత్తినప్పటికీ, దీనిపై చర్చించడానికి మండలి నిరాకరించి, నేడు ట్రూఅప్ ప్రతిపాదనలో ప్రజల కళ్ళుగప్పే రీతిలో పొందుపర్చడం అన్యాయం అన్నారు.పంపిణీ సంస్థలు ట్రూఅప్ ప్రతిపాదనలపై సమాచారం ఇచ్చిన తర్వాత 8 నెలల పాటు మండలి స్పందించకుండా కాలయాపన చేయడం గర్హనీయం అన్నారు. ఈ నెలాఖరు నాటికి మండలి ఛైర్మన్, టెక్నికల్ సభ్యుడు పదవీకాలం పూర్తవుతున్న సమయంలో హడావుడిగా ఇటువంటి విచారణ చేపట్టడం హేతుబద్ధం కాదన్నారు. నియంత్రణ మండలి నిబంధనల స్ఫూర్తికి భిన్నంగా, ఏకపక్షంగా రూ.8,114 కోట్లుజ ట్రూఅప్ భారాలపై విచారణ ప్రక్రియ సాగించడం, దానిని మొక్కుబడి తంతుగా మార్చడం తగదన్నారు. ఈప్రతిపాదనలపై సిపిఐ(యం) పేర్కొన్న అభ్యంతరాలను దృష్టిలో ఉంచుకొని బహిరంగ విచారణ ప్రక్రియలో తగు మార్పులు చేయాలన్నారు. విద్యుత్ చార్జీలు బారాలు తగించే వరకు సీపీఎం ప్రజల పక్షాన పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ సభ్యులు వీరాస్వామి, మోహన్ ప్రతాప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చట్ట విరుద్ధం

- గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా

విశాలాంధ్ర - గూడూరు : గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టం- 1994 గూడూరు డివిజన్లో పటిష్టంగా అమలు అయ్యే విధంగా అందరూ సహకరించాలని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా అన్నారు . శుక్ర వారం గూడూరు పట్టణం లోని గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా నేషనల్ హెల్త్ మిషన్ సబ్ డివిజనల్ మల్టీ మెంబర్ అప్రొప్రియేట్ అథారిటీ కమిటీ సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా మాట్లాడుతూ శిశు లింగ నిర్ధారణ చట్టం 1994 అమలుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను కమిటీ సభ్యులకు వివరించారు . ఎక్కడైనా చట్టం ఉల్లంఘన జరిగితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు .కమిటీ సభ్యులు ఈ యాక్ట్ పై విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు . ఈ కార్యక్రమంలో డిప్యూటీ డి.ఎం.హెచ్.వో పద్మావతి, బాబు , నెహ్రూ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా పెట్టండి

పాలసముద్రం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

విశాలాంధ్ర-పాలసముద్రం: పాలసముద్రం పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం నాడు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ రవాణాపై, మత్తు పదార్థాలపై ప్రత్యేకంగా నిఘా పెట్టాలని, రాత్రిపూట గస్తీలు నిర్వహించాలని, ఎక్కడా అక్రమాలకు తావు లేకుండా చూడాలన్నారు. అదేవిధంగా ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలని, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆయన అన్నారు తరువాత రికార్డులు తనిఖీ చేశారు. చుట్టుపక్కల పరిసరాల ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఖరీఫ్ పంట 2024 ఈక్రాప్ నమోదు సామాజిక తనిఖీలు

విశాలాంధ్ర - గుడిపాల : గుడిపాల మండలంలోని పాపసముద్రం రైతుసేవ కేంద్రంలో ఖరీఫ్ 2024 ఈ పంట సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు .రైతులు సాగుచేసిన అన్ని పంటలను ఈ పంట యాప్ నందు నమోదు చేసి 450 ఎకరాలకు 344 మంది రైతులకు ఈ కే వై సీ పూర్తి చేయడం జరిగిందని గ్రామ సభలో రైతు పేరు, తండ్రి పేరు, ఈ పంట బుకింగ్ ఐడి, ఆధార్ నెంబరు, ఫోన్ నెంబరు, సాగుచేసిన పంట, పంటరకము. విత్తిన తేదీ, పంటసరలి, రైతులకు చదివి వినిపించడం జరిగింది. పంట నమోదులో ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 18 వ తేదీలోగా రాతపూర్వకంగా అర్జీ ఇస్తే మార్పులు చేర్పులు చేసి తుది జాబితాను తయారుచేస్తామని రైతులకు తెలిపారు. ఈ పంట నమోదు డేటా ఆధారంగానే పంటలకు సున్నావడ్డీ పంట రుణాలు, పంటలకు బీమా, పంట నష్టపరిహారం, రైతులకు పెట్టుబడి సాయం అందుతుంది.ఈ గ్రామసభకు మండల వ్యవసాయ అధికారి వి.మాధవి ,గౌరవ గ్రామ సర్పంచ్ .వల్లియమ్మ చిట్టిబాబు ,వీ.ఏ.ఏ తులసిరాం రెడ్డి ,గణేష్ శివలింగారెడ్డి ,పయని, ఐజాక్ ,రాజేంద్రన్, సతీష్ గ్రామ రైతులు పాల్గొన్నారు, పాప సుందరం పంచాయతీకి చెందినటువంటి రైతులు ఖరీఫ్ పంటలో ప్రధాన పంటైన వేరుశనగ సకాలంలో వర్షాలు లేక పూర్తిగా నష్టపోయామని ఈ విషయాన్ని పై ఉన్నతాధికారులకు తెలియజేసి వేరుశనగ పంట నష్టపరిహారం రైతులకు చెల్లించాలని రైతులు కోరారు.

తిరుపతి జిల్లా మూడు రోజుల పర్యటనలో భాగంగా రేణిగుంట విమానాశ్రయంకు చేరుకున్న జాతీయ సఫాయి కరంచారి కమిషన్ చైర్మన్‌కి సాదర స్వాగతం

విశాలాంధ్ర - తిరుపతి : ఈ నెల అక్టోబర్ 18 నుండి 20 వరకు తిరుపతి జిల్లా పర్యటనలో భాగంగా పలు కార్యక్రమాలలో పాల్గొను టకు నేటి మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయంకు విచ్చేసిన జాతీయ సఫాయి కరంచారి కమిషన్ చైర్మన్ ఎం. వెంకటేశన్ కి జిల్లా సాంఘిక సంక్షేమ మరియు సాధికార అధికారి చెన్నయ్య మరియు ఆర్డీవో శ్రీకాళహస్తి భాను ప్రకాష్ రెడ్డి తదితరులు సాదర స్వాగతం పలికారు.జాతీయ సఫాయి కరంచారి కమిషన్, న్యూ ఢిల్లీ చైర్మన్ ఎం.వెంకటేశన్ ఈ నెల అక్టోబర్ 18 నుండి 20 వరకు తిరుపతి జిల్లా మరియు చిత్తూరు జిల్లాలో 'ది ప్రొహిబిషన్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్ యాజ్ మాన్యువల్ స్కావెంజర్ అండ్ రీహాబిలిటేషన్ యాక్ట్, 2013' అమలును సమీక్షించడానికి మరియు పలు కార్యక్రమాలలో పాల్గొనటానికి నేటి మధ్యాహ్నం 12.30 గంటలకు రేణిగుంట విమానాశ్రయం కు విచ్చేసిన అనంతరం చిత్తూరు జిల్లాకు రోడ్డు మార్గాన చేరుకుని పలు కార్యక్రమాలలో పాల్గొని తిరిగి రాత్రి 8.00 గం.లకు తిరుపతికి విచ్చేసి రాత్రి బస చేసి, రేపు అనగా 19 వ తేది ఉదయం తిరుమల శ్రీవారిని విఐపి బ్రేక్ దర్శనం చేసుకుని మధ్యాహ్నం 12 గంటలకు తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ మరియు సెక్రటరీతో పాటు సంబంధిత సఫాయి కరంచారి నాయకులు మరియు పారిశుధ్య కార్మికులతో సమావేశం తుడా మీటింగ్ హాల్ నందు నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు డీన్ మరియు మెడికల్ సూపరింటెండెంట్, శ్రీ వెంకటేశ్వర రాంనారాయణ్ రుయా ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ - (హాస్పిటల్) మరియు ఇతర సీనియర్ అధికారులతో పాటు సఫాయి కరంచారిల నాయకులు మరియు పారిశుధ్య కార్మికులతో సమావేశం రుయా హాస్పిటల్ మీటింగ్ హాల్ నందు నిర్వహిస్తారని, సాయంత్రం 5 గంటలకు శ్రీ వెంకటేశ్వర ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ మరియు హాస్పిటల్ డైరెక్టర్-కమ్-వైస్ ఛాన్సలర్, మెడికల్ సూపరింటెండెంట్ మరియు ఇతర సీనియర్ అధికారులతో పాటు సంబంధిత అధికారులు మరియు సఫాయి కరంచారిల నాయకులతో సమావేశం స్విమ్స్ మీటింగ్ హాల్ నందు నిర్వహిస్తారని, అనంతరం అదే రోజు రాత్రి తిరుపతి నందు బస చేస్తారని, మరుసటి దినం అనగా 20వ తేదీన ఉదయం 9.10 గంటలకు రేణిగుంట విమానాశ్రయం నుండి వారు ఢిల్లీ కి తిరుగు ప్రయాణం కానున్నారు.

దళిత ఉద్యోగులకు జాతీయ ఎస్సీ. ఎస్టీ వెల్ఫేర్ పార్లమెంటరీ కమిటీ అండగా నిలుస్తుంది

- చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు

విశాలాంధ్ర -చిత్తూరు : దేశవ్యాప్తంగా ఉన్న దళిత ఉద్యోగుల సమస్యలను జాతీయ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ పార్లమెంటరీ కమిటీ సత్వరం పరిష్కరిస్తుందని.వారికి అండగా నిలుస్తుందని ఆ కమిటీ సభ్యులు, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు తెలిపారు. ప్రభుత్వ సంస్థలు రూల్ ఆఫ్ రిజర్వేషన్ను తప్పనిసరిగా అమలు చేయాల్సిందేనని ఆయన సూచించారు.కేరళ రాష్ట్రంలోని మున్నా ర్, కొచ్చి వేదికగా గత మూడు రోజులుగా దళిత ఉద్యోగుల సమస్యలను పరిష్కారించేందుకు. జాతీయ ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ పార్లమెంటరీ కమిటీ సభ్యులు సమావేశాలను నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు.. జాతీయ ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ పార్లమెంటరీ సభ్యుని హోదాలో ఈ సమావేశాలకు హాజరయ్యారు.ఆయనతోపాటు ఈ సమావేశానికి దేశంలోని అన్ని రాష్ట్రాలకు సంబంధించిన 39 మంది పార్ల మెంటు సభ్యులు కూడా పాల్గొన్నారు. ఈసందర్భంగా జాతీయ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ పార్లమెంటరీ కమిటీ సభ్యులు ఎస్సీ, ఎస్టీ ఉద్యో గులు ఎదుర్కొం టున్న సమస్యలపై సుదీర్ఘంగా సమీక్షించారు. భారత రాజ్యాంగానికి అనుగుణంగా వారు తమ కర్తవ్యాన్ని నిర్వర్తి ంచుకునేందుకు కావలసిన వాతావరణాన్ని ప్రభుత్వ సం స్థలు కల్పిస్తున్నాయా? లేదా? అన్న అంశాలపై చర్చించారు. అనం తరం జాతీయ ఎస్సీ. ఎస్టీ వెల్ఫేర్ పార్లమెంటరీ కమిటీ సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు ఉద్యోగులతో ముఖాముఖి మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు పడుతున్న ఇబ్బందులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అలాగే ఉద్యోగుల నుంచి వినుతులను స్వీకరి ంచారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు జాతీయ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ పార్ల మెంటరీ కమిటీ భరోసాగా ఉంటుందని భరోసాని ఇచ్చారు. భార ంత రాజ్యాంగం కల్పించిన హక్కులను ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులంతా సద్వినియోగం చేసుకునేందుకు సహకరిస్తుందని తెలియజేశారు.

వైసీపీ నేతలతో చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ముచ్చట్లు

అల్పాహారం తింటూ యోగక్షేమాలపై ఆరా

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: చంద్రగిరి నియోజకవర్గం తిరుపతి రూరల్ మండలంకు చెందిన వైసీపీ ముఖ్య నేతలతో ఆ పార్టీ నియోజక వర్గ ఇన్ ఛార్జ్, తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సరదాగా ముచ్చటించారు. శుక్రవారం సాయంత్రం తిరుచానూరు శిల్పారామంకు ఎదురుగా వున్న ఓ హోటల్‌లో పార్టీ ముఖ్యనేతలతో కలసి అల్పాహారం తింటూ సరదాగా ముచ్చటి ంచారు. ఎన్నికలు ముగిసిన తరువాత పార్టీ ముఖ్యనాయకులతో మోహిత్ రెడ్డి సరదాగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలుకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకోవడం, ప్రతిపక్షంలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కష్టపడదామని చెప్పడంతో ఆ పార్టీ నేతల్లో నూతన ఉత్సాహం నిండుకుంది. ఎన్నికల్లో బాగా కష్టపడ్డారని, గెలుపు, ఓటమి దైవనిర్ణయమని, ప్రజలకు తోడుగా నిలబడితే భవిష్యత్తులో మంచి జరుగుతుందని చెప్పడంతో పార్టీ నేతలు అందరూ తప్పకుండా మీ వెంట నడుస్తామన్నారు. ప్రభుత్వ వ్యతిరేఖ విధానాలపై ప్రజల్లో తిరుగుబాటు మొదలయ్యే రోజులు ఎంతో దూరం లేదని పలువురు పార్టీ నేతలు మోహిత్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. జగనన్నను స్ఫూర్తిగా తీసుకుని పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని ముఖ్య నేతలు అందరికీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.